గత వారం రోజులపై విహంగ వీక్షణం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 266 పేజీలు: 10+4 వెల: 6.50



కన్నడిగులకు అన్యాయం జరిగితే చర్యలు: డికె 5

6 కరవు పరిస్థితిపై 28న అఖిలపక్షభేటీ





థాంక్స్.. మా ర్యాలీకి మీ ప్రచారం 7

సోషల్ మీడియాలో బిజెపిపై రాహుల్ సెటైర్లు

వచ్చే వారం రోజులు ఇదే ఉత్సాహంతో ఉండాలని విసుర్లు





'మన్ కీ బాత్'కి పన్నెండేళ్లు

ఈ కార్యక్రమం ఓ తీర్థయాత్ర లాంటిది

ప్రజలంతా నాకు మార్గదర్శకులే: ప్రధాని మోడీ 3




ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కె హార్మనీ ఫెస్టాలో డి.సిఎం భట్టి

## తెలంగాణలో కొరియా పెట్టుబడులు

ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్, పునరుత్పాదక ఇంధనరంగాల్లో కొరియాతో భాగస్వామ్యం

ఐదేళ్లలో పర్యాటకానికి రూ.15 వేలకోట్ల పెట్టుబడులు లక్ష్యం

కె హార్మనీ ఫెస్టాలో డి.సిఎం భట్టి

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థలతో కలిసి పనిచేసేందుకు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో

>>2

# 'మహా' భేటీ నేడే



తుమ్మిడిహెట్టి బ్యారేజి ఎత్తుపై మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్‌తో రేవంత్ చర్చలు

152 మీటర్లకు పెంచడానికి భగీరథ యత్నం

ప్రాజెక్టును పట్టించుకోని గత ప్రభుత్వం

ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టు

పాల్గొంటున్న మంత్రి ఉత్తమ్, అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు25:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గతంలో ఒప్పందాల దశలో ఆగిపోయిన ఈ ప్రాజెక్టును సాకారం చేసేందుకు వరుస సమీక్షలు, సమావేశాలతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. సోమవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం ఈ బ్యారేజీ ఎత్తుపై కీలక చర్చలు జరుపనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ముంబైకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లారు. రాత్రి ముంబైలో బసచేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ కానున్నది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనున్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు. కాగా, 2016 ఆగస్టు 23న అప్పటి తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రతో కుదుర్చుకున్న ఒప్పందంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నీటిమట్టాన్ని +148 మీటర్లకు పరిమితం చేసింది. ఆ తర్వాత గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టి తుమ్మిడిహెట్టిని పూర్తిగా పక్కన పడేసింది. దీంతో ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు ఆశించిన స్థాయిలో సాగు, తాగునీరు అందలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు తాగు సాగునీటిని అందించే సంకల్పంతో ఈ బ్యారేజీపై దృష్టి సారించారు. గ్రావిటీద్వారా ఎక్కువ నీటిని తెచ్చుకునేందుకు తుమ్మిడిహెట్టి నిర్మించేందుకు పున:ప్రయత్నాలు ప్రారంభించారు. 148 మీటర్ల ఎత్తున ఆశించినంత నీటిని తెచ్చుకునే వీలు లేనందున, +152 మీటర్ల ఎత్తు బ్యారేజీ నిర్మించుకునేందుకు అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయటంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. 2025, డిసెంబర్ 4న ఆదిలాబాద్‌లో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి నిర్మాణం చేపట్టి ఆదిలాబాద్ పంట పొలాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. 2026 జనవరిలో నిర్మల్ సభలో మరోసారి స్పష్టత ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏప్రిల్ 29న తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ కార్యాచరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో వెంటనే సంప్రదింపులు ప్రారంభించాలని ఆదేశించారు. మే 6న తుమ్మిడిహెట్టి బ్యారేజీపై చర్చలకు సమయం కేటాయించాలని

>>2



ఆదివారం పాట్నా సభలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

## సర్‌పై పోరాటం రెండో స్వాతంత్ర్య సమరం

ఎన్నికల అక్రమాలతోనే బిజెపి అధికారంలోకి

అక్రమార్కులను జైలుకు పంపిస్తాం

బీహార్‌లో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే

**పాట్నా, అక్టోబరు 25:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేసి, అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కోరారు. గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్లజాబితాల అక్రమాలతోనే బిజెపి అధికారంలోకి వచ్చిందని అందుకేఈ ఎన్నికలను రద్దుచేసి బ్యాలెట్‌ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేస్తున్నామన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను "రెండో స్వాతంత్ర్య యుద్ధం"గా అభివర్ణించారు. సర్‌ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినవారిని జైలుకు పంపిస్తామని చెప్పడంతో జనసమూహంనుంచే తిరుగుబాటు జరగనంతవరకూ ప్రధాని మోడీ ఎక్కడికీ వెళ్లరని పెద్దగా అరుపులు వినిపించాయి.

>>2



## రెండో పంట వేయొద్దు

రాష్ట్రంలో 15 లక్షల బోర్లలో అడుగంటిన నీరు

రైతులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి

**కొత్తగూడెం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉన్నందున రైతులు రెండో పంట సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 34 లక్షల బోర్లు ఉండగా, ఇప్పటికే 15 లక్షల బోర్లలో నీరు అడుగంటిందని వెల్లడించారు. ఆదివారం చుంచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనపై మంత్రి విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమిషన్లకు ప్రాధాన్యమిచ్చారని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే ఎలాంటి కమిషన్లు రావనే ఉద్దేశంతోనే గత పాలకులు పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో తొలి విడతలో రెండున్నర లక్షలు, రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్‌లో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. దేశంలో ఓటు హక్కు పరిరక్షణ కీలకమని

>>2



## రాహుల్‌కు ఎటిఎంగా తెలంగాణ

420 హామీలిచ్చి ముఖం చాటేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత

రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?

ప్రజల్లో విభజన సృష్టిస్తున్న బిజెపి: కెటిఆర్ ధ్వజం

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై స్పందించకుండా మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాహుల్ గాంధీకి ఏటీఎంగా మారిందని, రేవంత్

>>2

## పత్తి ధరలు టాప్

క్వింటాలు రూ.9,260

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాత వార్త:** రాష్ట్రంలో పత్తి కొనుగోలు ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. ఈ మార్కెటింగ్ సీజనులో కనీస మద్దతు ధర మించి కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే సుదీర్ఘ పొడి వాతావరణం, ఎల్ నినో పరిస్థితులు దిగుబడులను గణనీయంగా దెబ్బ



తీసే ప్రమాదం ఉందని రైతుల్లో ఆందోళనవ్యక్తమవుతోంది. 2026 – 27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజనుకు గాను పొడవాటి పీచు పత్తికి క్వింటాలుకు రూ.8,667గా కనీస మద్దతు ధరను కేంద్రం నిర్ణయించింది. కానీ ఈ మద్దతు ధర కంటే ఎక్కువగా వ్యాపారులు క్వింటాలుకు రూ.9,260 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలో,

>>2



## దొరికేదంతా 'సన్న'మేనా?

సర్కార్‌కు దొడ్డురకం సరఫరాతో మిల్లర్ల టోకరా

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో

16 మిల్లులపై సిఐడి దాడులు.. 14 మంది అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** గత ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖకు నిబంధనల మేరకు అందించాల్సిన సన్న బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం సరఫరా చేసి, సర్కారుకు భారీ నష్టం కలిగించిన రైస్ మిల్స్‌పై సిఐడి ఆదివారం నాడు దాడులు నిర్వహించింది. నిజా మాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాలలో 16 రైస్ మిల్స్‌పై జరిగిన దాడుల్లో 14 మందిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి డిజి చారు సిన్హా మీడియాకు వెల్లడించారు. గత ఖరీఫ్ సీజన్‌లో 71.86 మెట్రిక్ టన్నుల వడ్లను సర్కారు రైతుల నుంచి కొనుగోలు చే సింది. దీనితో 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిలువలను రైస్ మిల్లర్లు ఎఫ్‌సిఐకి అందించాల్సి వుంది. అయితే కొన్ని రైస్ మిల్స్ తా ము అందించాల్సిన సన్న రకం బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకుని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన తక్కువ ధరకు లభించే నాణ్యత తక్కువగా వుండే బియ్యాన్ని (దొడ్డు బియ్యం) ఎఫ్‌సిఐకి అందించాయి. దీనిపై ఎఫ్‌సిఐతోపాటు పౌర సరఫరాల విభాగం నుంచి అందిన ఫిర్యా దు మేరకు రైస్ మిల్స్ నుంచి సరఫరా

>>2

## 'అర్నబ్' ప్రభావం: తెలంగాణకు భారీ వర్ష సూచన

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాత వార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం అర్నబ్ తుఫానుగా బలపడుతోంది. దీంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నెల 28, 29 తేదీల్లో



రాష్ట్రంలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపింది. వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, జయశంకర్ భూపాలపల్లి, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, హైదరాబాద్‌తో

>>2




## అల్లకల్లోలం

పాలకులపై విసుగెత్తి రోడ్డెక్కుతున్న జనం

నిరసన ర్యాలీలో కదం తొక్కుతున్న లక్షలాది ప్రజలు

ఫ్రాన్స్, అల్బేనియా, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్‌లో హాహాకారాలు

**ప్యారిస్, అక్టోబరు 25:** జీవన వ్యయం పెరుగుదల, అందుబాటులోలేని గృహాలు, విద్యాప్రమాణాలు, పింఛన్లు,ప్రభుత్వ అవినీతి ఆరోపణలకు వ్యతిరేకంగా ఐరోపా దేశాల్లో వేలాది మంది ప్రజలు వారాంతంలో వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఫ్రాన్స్, అల్బేనియా, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్ దేశాల్లో జరిగిన ఆందోళనల్లో వివిధ సామాజిక, రాజకీయ సమస్యలపై ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పలునగరాల్లో నిరసనలు హింసాత్మకంగా మారడంతో అరెస్టులు చోటుచేసుకున్నాయి. భద్రతా చర్యలను అధికారులు మరింత కట్టుదిట్టం చేశారు.

చాలా చోట్ల నిరసనలు శాంతియుతంగా సాగినప్పటికీ, కొన్ని ప్రాం తాల్లో ఆందోళనకారులు పోలీసులపై వస్తువులు విసరడంతో ఘర్షణలు చెలరేగాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు బాష్పవాయువు, వాటర్ కేనన్లు ప్రయోగించడంతోపాటు అదనపు బలగాలను మోహరించారు. పెరుగుతున్న కుటుంబ ఖర్చులు, ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక అసమానతలపై ఆందోళనల నేపథ్యంలో ఈ నిరసనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఫ్రాన్స్‌లో భారీ స్థాయిలో నిరసనలు జరిగాయి. పాఠశాలలకు నిధుల కేటాయింపు, పెరుగుతున్న జీవన వ్యయం, అసమానతలకు వ్యతిరేకంగా లక్షలాది మంది ర్యాలీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 4.10 లక్షల మంది నిరసనల్లో పాల్గొన్నట్లు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. సీఎన్‌జీటీ కార్మిక సంఘం మాత్రం ఈ సంఖ్య దాదాపు 8 లక్షలుగా పేర్కొంది. దాదాపు వెయ్యి మందిని అరెస్టు చేసినట్లు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ నూనెజ్ తెలిపారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. పారిస్‌లో ప్రధాన ర్యాలీ ఎక్కువగా శాంతియుతంగానే సాగినప్పటికీ, ముగింపు దశలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసులపై నిరసనకారులు వస్తువులు విసరడంతో బాష్పవాయువు, వాటర్ కేనన్లను ప్రయోగించారు. అంతకుముందు వారాంతంలో జరిగిన విస్తృత దోపిడీలు, విధ్వంసం నేపథ్యంలో దేశవ్యాప్తంగా 70 వేల మంది పోలీసు అధికారులను భద్రత కోసం మోహరించారు. పాఠశాలల్లో సిబ్బంది కొరత, నిధుల సమస్యలపై ప్రారంభమైన ఈ ఉద్యమం క్రమంగా మెరుగైన ప్రజా సేవలు, పెరుగుతున్న జీవన వ్యయం నుంచి ఉపశమనం కల్పించాలనే డిమాండ్లకు విస్తరించింది. అల్బేనియా రాజధాని తిరానాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేలాది మంది నిరసనకారులు

>>2



ఆదివారం వారణాసిలో ఎయిర్ షోను తిలకిస్తున్న ప్రధాని మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, యుపి సిఎం యోగి తదితరులు

# సర్‌పై పోరాటం
## రెండో స్వాతంత్ర్య సమరం

>> దీనితో వెంటనే స్పందించిన ఖర్గే మోడీ నాన్న అయినా జైలుకువెళ్లాల్సిందేనంటూ ప్రతిస్పందన ఇవ్వడంతో ఈ వ్యాఖ్యలు కాస్తా వివాదాస్పదం అయ్యాయి. బెంగాల్, హరియాణా, బిహార్, మహారాష్ట్రలో ఓట్ల చోరీ ద్వారా ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని, ఈ దొంగలందరినీ జైలుకు పంపిస్తామని అన్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి, తమ హక్కుల కోసం పోరాడాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నుంచి ప్రజలకు పారదర్శకత, జవాబుదారీతనం కావాలని పేర్కొన్నారు. బిహార్ తొలి ముఖ్యమంత్రి డాక్టర్ శ్రీ కృష్ణ సింగ్ 139వ జయంతి ఉత్సవాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల భావజాలం దేశంలో విభజనలను మరింత తీవ్రతరం చేస్తోందని ఖర్గే ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని నిర్మూలించే వరకు దేశంలో శాంతి ఉండదని వ్యాఖ్యానించారు. నీతీష్ కుమార్ వంటి సోషలిస్ట్ నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని నమ్మే వ్యక్తులతో చేతులు కలపడం నాకు బాధ కలిగిస్తోందన్నారు. "నేడు మనం ఆర్‌ఎస్‌ఎస్ గురించి మాట్లాడితే ప్రజలు దానిని భిన్నంగా అర్థం చేసుకోవచ్చు. ఈ దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్నంత కాలం, శాంతి ఉండదు. మేము ఐక్యత, సమానత్వం, రాజ్యాంగాన్ని విశ్వసించే దేశభక్తులం. బీజేపీ నాయకుల్లా రాజకీయ లబ్ధి కోసం మన ప్రజలను విభజించేవాళ్లం కాదు." అని అన్నారు. హల్వానీ శుద్ధీకరణ చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు. కుల వివక్ష, వెలివేత వంటివి మానవ గౌరవాన్ని, సమానత్వాన్ని దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. దేశంలోని ప్రతి ఆలయంలోకి దళితులు ప్రవేశించేందుకు, అక్కడ పూజలు చేసుకునేందుకు వారికి పూర్తి హక్కు ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. "మా పోరాటం మతానికి వ్యతిరేకం కాదు. మతం పేరుతో జరిగే వివక్షకు వ్యతిరేకం. నా మతం పట్ల నాకు గర్వం ఉంది. నా పేరు కూడా ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకదాని నుంచి ప్రేరణ పొందిందే. మతం ప్రజలను ఏకం చేయాలి, విభజించకూడదు." అని అన్నారు. అయోధ్యలోని రామమందిరానికి అందిన విరాళాల వివాదంపై బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు ఖర్గే. రాముడు తన కళ్లు తెరిచి, తన పేరుతో సంపదను దోచుకున్న వారికి తగిన శిక్ష విధించాలని ఆయనను ప్రార్థిస్తున్నానని అన్నారు.

# దొరికేదంతా 'సన్న'మేనా?

>> అయిన దొడ్డు బియ్యాన్ని ల్యాబ్‌లో పరీక్షించి ఇవి తక్కువ రకం నాణ్యత కలిగినవిగా తేల్చారు. ఈ గోల్‌మాల్ వ్యవహారం నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాలకు చెందిన 16 రైస్ మిల్స్‌లో జరిగాయని సిఐడికి ఫిర్యాదు అందింది. ఈ రైస్ మిల్స్ నుంచి 3,385.820 మెట్రిక్ దొడ్డు బియ్యం అందినట్లు తేలింది. వాస్తవానికి ఇక్కడ సన్న బియ్యం అందాల్సి వుంది. దీనివల్ల సర్కారుకు కోటీ 69 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు తేలింది. దీంతో పాటు 45,414.833 మెట్రిక్ టన్నుల బియ్యం కన్వర్షన్ సవ్యంగా జరగ లేదని, దీనివల్ల సర్కారుకు మరో 242 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దీనిపై సమాచారం అందుకున్న పౌర సరఫరాల విభాగం అధికా రులు మరింత నష్టం జరగకుండా ఆరోపణలు వచ్చిన రైస్ మిల్స్ నుంచి బియ్యం సేకరణను నిలిపివేసింది. ఈ ఘటనల నేపథ్యంలో పౌర స రఫరాల విభాగం నుంచి అందిన ఫిర్యాదు మేరకు సిఐడి అధికారులు మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి సన్న బియ్యంకు బదులు దొడ్డు బియ్యం సరఫరా చేసి సర్కారుకు భారీగా నష్టం కలుగచేసిన 16 రైస్ మిల్స్‌పై దాడులు నిర్వహించి 14 మంది నిర్వాహకు లను అరెస్టు చేశా రు. ఈ గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ సాగుతోందని సిఐడి డిజి చారు సిన్హా తెలిపారు. ఇందులో ఎంతమేర నష్టం జరిగింది...? ఎంతమ ంది నిందితులు వున్నారు...? ఆరోపణలు వచ్చిన రైస్ మిల్స్‌కు సర్కారు ఇచ్చిన కోటా ఎంత...? అక్కడి నుంచి సరఫరా అయ్యింది ఎంత...? అనే దానిపై కులంకుశంగా విచారణ చేస్తామని, ఇందులో ఎవరున్నా వదిలిపెట్టేది లేదని సిఐడి బాస్ స్పష్టం చేశారు.

**సిఐడి అదుపులో మరికొందరు...?**

కాగా ఈ ఘటనలో సిఐడి అధికారులు మరికొందరు రైస్ మిల్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిని విచారిస్తున్నట్లు సమాచారం. సర్కారును మోసం చేయడంపై సిఐడి తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ కేసులో పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కూడా రంగంలో దిగి గోల్‌మాల్ వ్యవహారాలపై సమాచారం సేకరించి సిఐడికి వాటిని అందించడంతో బండారం రట్టయ్యిందని తెలిసింది.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

>> పాటు ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడవచ్చని తెలిపింది. కాగా, తుఫాను ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 115-125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ ఒడిశా తీరాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. ఈనెల 28న తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగామతో పాటు మరికొన్ని జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.

# 'మహా' భేటీ నేడే

>> కోరుతూ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి స్వయంగా లేఖ రాశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై చర్చిం చేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృం దానికి సమయం ఇవ్వాలని కోరారు. బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం, ఇతర అంతర్రాష్ట్ర అంశాలపై పరస్పర చర్చల ద్వారా పరిష్కరిం చుకుందామని విజ్ఞప్తి చేశారు. జూన్ 11న మహారాష్ట్రతో ఉన్న పెండింగ్ అంశాల పరి ష్కారానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకో వాలని ముఖ్యమంత్రి రేవంత్ ప్రధానమంత్రికి లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగేలా సహకరించాలని కోరారు. తెలంగాణ భవిష్యత్ సాగు, తాగునీటి అవసరాలకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరిం చారు. ముఖ్యమంత్రి లేఖను ప్రధానమంత్రి కార్యాలయం కేంద్రజల్‌శక్తి శాఖకు పంపిం చింది. ఆగస్టు 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిశారు. తుమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర అంగీకారం సాధించేందుకు కేంద్రం సహక రించాలని కోరారు. +148 మీటర్ల వద్ద గ్రావి టీ ద్వారా ఆశించిన స్థాయిలో నీటిని తరలిం చడం సాధ్యం కాదని వివరించారు. +150 నుంచి +152 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటిని తరలించి విద్యుత్ వ్యయాన్ని తగ్గించవచ్చని తెలిపారు. సిడబ్ల్యు పిఆర్ఎస్ పుణె నిర్వహించిన బ్యాక్‌వాటర్ అధ్యయనాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసు కెళ్లారు. కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని, అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో చర్చలు ఏర్పా టు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. మ్యుమంత్రి రేవంత్‌రెడ్డి వరుస ప్రయత్నాల నేపథ్యంలో కేంద్ర జల సంఘం ఢిల్లీలో తెలం గాణ, మహారాష్ట్ర అధికారులతో సెప్టెంబర్ 1న అంతర్రాష్ట్ర సమావేశం ఏర్పాటు చేసింది. కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంత ర్రాష్ట్ర అంశాలపై చర్చించారు. సెప్టెంబర్ 3న సిడబ్ల్యుపిఆర్ఎస్ పుణె నిర్వహించిన బ్యాక్ వాటర్ అధ్యయనాలను తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర జలవనరుల శాఖకు పంపించింది. 148 నుంచి +152 మీటర్ల వరకు వివిధ నీటిమట్టాల్లో ముంపు ప్రభావాన్ని చూపించే కాంటూర్ మ్యాపులను అందజేసింది. సోమ వారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై కీలక చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తెలంగాణ ప్రతినిధి బృందం ముంబైకి ఆదివారం సాయంత్రమే వెళ్లింది.

## వారం - వర్జ్యం

**26-10-2026, సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం, శరదృతువు, శుక్లపక్షం, స్వాతి కార్తె**

○ తి. పౌర్ణమి ఉ.9.39, న. అశ్విని సా.5.38
వ.1.మ.1.54-మ.3.24,వ.2.రా.2.26-రా.3.54
దు.1.మ.12.14-మ.1.00
దు.2.మ.2.33-మ.3.19
రాహు ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.5.00-ఉ.6.00

## వార్తాఫలం

**మేషం :** ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి. వాహనాలు నడిపేప్పుడు మెలుకువ అవసరం. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**వృషభం :** సభలు, సమావేశాలలో పాల్గొంటారు. బంధువుల నుండి ఆసక్తికరమైన సమాచారం అందుకుంటారు.

**మిథునం :** క్రొత్త పెట్టుబడులకు అనుకూలమైన కాలం కాదు. ఉద్యోగస్థులు అప్రమత్తంతో వ్యవహరించడం మంచిది.

**కర్కాటకం :** సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. కుటుంబ వివాదాలు కొంతవరకు తీరుతాయి. వాహన సౌఖ్యం.

**సింహం :** ఆర్థిక లాభాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సోదరులను కలిసి కష్టసుఖాలను చర్చించుకుంటారు. ప్రముఖుల కలయిక.

**కన్య :** రాజకీయ రంగాలలోని వారికి అనుకూలం. విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. కీలకనిర్ణయాలలో జాప్యం జరుగుతుంది.

**తుల :** ఋణాలు సకాలంలో తీరుస్తారు. క్రొత్త ఒప్పందాలు కలిసి వస్తాయి. అనుకోని అతిథుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**వృశ్చికం :** వద్దనుకున్న పలు అవకాశాలు మీ దగ్గరకు వస్తాయి. శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగులకు స్థాన చలనం.

**ధనుస్సు :** అనేక సందర్భాలలో సమస్యలు ఎదురవుతాయి. కాని వాటిని ఎదుర్కొని ముందుకు సాగుతారు.

**మకరం :** సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల అండదండలు సాధించుకోడానికి ఎంతో కృషి చేస్తారు.

**కుంభం :** అవతల వారిని అపార్థం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. తొందరపాటు వద్దు. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** ఎంతో కాలంగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి. క్రయవిక్రయాలలో నిదానం అవసరము.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అల్లకల్లోలం

>> ర్యాలీ నిర్వహించారు. ఇతర నగరాలకు కూడా ఆందోళనలు విస్తరించాయి. నిరసనకారులు పోలీసులపై రాళ్లు విసరడం, వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రవేశద్వారం వద్ద నిప్పు పెట్టడంతో అల్లర్ల నిరోధక పోలీసులు బాష్పవాయువు, వాటర్ కేనన్లు, రబ్బరు బుల్లెట్లను ఉపయోగించారు. కొందరు నిరసనకారులు పోలీసుల వైపు బాణసంచా ప్రయోగించడంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులను లక్ష్యంగా చేసుకున్నారు. విద్యార్థులు ట్యూషన్ ఫీజులను తగ్గించాలని, విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని, అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధానమంత్రి ఎడి రామా రాజీనామా చేయాలనే డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ మద్దతుతో చేపట్టిన విలాసవంతమైన తీరప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గత కొన్ని నెలలుగా ఎక్కువగా శాంతియుత నిరసనలు జరుగుతున్నాయి. తిరానాలో సుమారు 2,500 మంది పోలీసులను మోహరించారు. ఇటీవలి అల్లర్లలో 300 మందికి పైగా నిరసనకారులు, పోలీసు సిబ్బంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. మిలన్, రోమ్, టూరిన్, నేపుల్స్, బొలోగ్నా, ఫ్లోరెన్స్ నగరాల్లో వేలాది మంది ర్యాలీలు నిర్వహించారు. యుద్ధానికి వ్యతిరేకత, సైనిక పునరాయుధీకరణతో పాటు పలు సామాజిక, రాజకీయ సమస్యలను వారు ప్రస్తావించారు. ఎనిమిది నగరాల్లో జరిగిన నిరసనల సందర్భంగా తొమ్మిది మందిని అరెస్టు చేయగా, 371 మందిని కొద్దిసేపు అదుపులోకి తీసుకున్నట్లు ఇటలీ పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్లకు తరలించిన వారిలో 110 మంది మైనర్లు ఉన్నారు. భద్రత కోసం మరో 500 మంది సైనికులను నగరానికి పంపనున్నట్లు ప్రధానమంత్రి జార్జియా మెలోని ప్రకటించారు. రోమ్‌లో కొందరు నిరసనకారులు కొలోసియంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది వారిని బయటకు పంపించారు. మరోవైపు, పియాజ్జా డెల్లా రిపబ్లికా సమీపంలో యుద్ధ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న కొందరు పోలీసులతో ఘర్షణకు దిగారు. స్పెయిన్, పోర్చుగల్‌లో పింఛన్లు, గృహ వసతులపై నిరసనలు, స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో వేలాది మంది పింఛనుదారులు, ఇతర నిరసనకారులు ప్రభుత్వ పింఛను వ్యవస్థకు మరింత రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వాస్తవ ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పింఛన్లు పెంచాలని, కనీస పింఛను మొత్తాన్ని పెంచాలని, మహిళలు-పురుషుల మధ్య పింఛన్లలో ఉన్న అంతరాన్ని తగ్గించాలని వారు కోరారు. ప్రభుత్వ పింఛను వ్యవస్థ ప్రైవేటీకరణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పెయిన్‌లో ఇళ్ల అద్దెలు, గృహాల ధరలు పెరుగుతుండటంతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం అధికమవుతోంది. పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లోనూ వేలాది మంది ప్రజలు అందుబాటు ధరల్లో ఇళ్లు కల్పించాలని, పెరుగుతున్న అద్దెలను నియంత్రించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ అనంతరం రోస్సియో స్క్వేర్‌లో 100కు పైగా గుడారాలతో తాత్కాలిక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇళ్ల నుంచి అద్దెదారులను ఖాళీ చేయించడం సులభతరం చేసే, కొత్త అద్దె ఒప్పందాలపై ఉన్న అద్దె పరిమితులను తొలగించే ప్రతిపాదిత చట్టాలను నిరసనకారులు వ్యతిరేకించారు. పోర్చుగల్‌లో ఆస్తుల ధరలు, అద్దెలు భారీగా పెరగడంతో ముఖ్యంగా యువతకు అందుబాటు ధరల్లో నివాసాలు దొరకడం కష్టంగా మారింది. ఐరోపా దేశాల్లో జరుగుతున్న ఈ నిరసనలన్నీ ఒకే ఉద్యమంలో భాగం కాకపోయినా, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి.

# తెలంగాణలో కొరియా పెట్టుబడులు

>> ఆదివారం నిర్వహించిన కె హార్మనీ ఫెస్టా-కొరియా కల్చర్ డే 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షి ణ కొరియాలో చేపట్టిన పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేశాయని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొరియా ఆర్థిక ప్రగతి నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికతపై నిరంతర పెట్టుబడులు అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.

పరిశ్రమలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షి ంచారు. పర్యాటక రంగంలోనూ కొరియా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-2030 ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష ్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పర్యాటక మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, సాంస్కృతిక అనుభవాల అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. యుద్ధం, పేదరికం వంటి సవాళ్లను అధిగమించి కొరియా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని కొనియాడారు. సాంకేతికత, తయారీ, విద్య, ఆవిష్కరణల్లో ఆ దేశం సాధించిన విజయాలు ప్రశంసనీయమన్నారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయని, సాంస్కృతిక ప్రభావం కూడా ఒక దేశ అంతర్జాతీయ గుర్తింపును పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు. ప్రాచీన భారతదేశం నుంచి కొరియాకు వెళ్లినట్లు విశ్వసించే రాణి హియో హ్వాంగ్‌ఓక్ గాథ రెండు దేశాల మధ్య చారిత్రక స్నేహానికి ప్రతీకగా నిలిచిందన్నారు. విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల కలయికకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రంగా నిలిచిందని చెప్పారు. బతుకమ్మ, బోనాలు, తెలుగు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కట్టడాలు తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. చార్మినార్, గోల్కొండ కోట, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం సహా రాష్ట్రంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ. లీ సియుంగ్‌హో స్వాగతం పలికారు.



ఉత్తర ప్రదేశ్‌లోని మథురలో రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం రాత్రి నిద్రిస్తున్న యుపి సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ కమిషన్ ప్రిలిమినరీ ఎలిజిబిలిటీ పరీక్ష అభ్యర్థులు

# రాహుల్‌కు ఏటీఎంగా తెలంగాణ!

>> రెడ్డి ఆయనకు ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఆదివారం తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిబ్రాన్ షరీఫ్‌కు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలులో జాప్యం, రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, 13 డిక్లరేషన్లను నెరవేరుస్తామని, మొత్తం 420 హామీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రజలకు మాట ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ 'ఛాత్రోంకీ గూంజ్' వంటి కార్యక్రమాల గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ హామీని ఎంతవరకు నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రావడం లేదని అన్నారు. మైనారిటీ సంక్షేమానికి రూ.4,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఆసరా పెన్షన్‌ను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని ఎందుకు నెరవేర్చడం లేదని నిలదీశారు. రైతులకు ఎకరానికి రూ.10,000కు బదులుగా రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ హామీని కూడా అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తే సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విమర్శలకు తిట్లతో బదులిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల హక్కు కూడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఒక్కొక్కటిగా వివాదాలు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ పెద్దల కుటుంబ సభ్యులకు సంబంధించిన భూముల వ్యవహారాలు, వ్యాపార ఒప్పందాలపై పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు, సుమారు రూ.200 కోట్ల విలువ ఉంటుందని చెబుతున్న ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి బహుమతిగా ఇచ్చినట్లుగా వ్యవహరించారని కేటీఆర్ ఆరోపించారు. అలాగే ముఖ్యమంత్రి చిన్న తమ్ముడి విద్యార్హతలు, ఏరోస్పేస్ రంగంలో ఆయన వ్యాపార కార్యకలాపాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. అమెరికాలో నివసిస్తున్న మరో తమ్ముడికి సంబంధించినదిగా పేర్కొంటున్న రూ.1,000 కోట్ల డీల్‌పై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వెలుగులోకి వస్తున్న ఈ ఆరోపణలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని, సంబంధిత వ్యవహారాలపై పారదర్శకంగా విచారణ జరగాలని కేటీఆర్ కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు హైదరాబాద్‌లో కరెంటు కోతలు, నీటి కొరత ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టేవని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రతి ఇంట్లో ఇన్వర్టర్లు, ప్రతి అపార్ట్‌మెంట్‌లో జనరేటర్లు తప్పనిసరిగా ఉండే పరిస్థితులు ఉండేవని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్, తాగునీరు సహా మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రజలపై జులుం చేసే వారిని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్న వారిని బీఆర్ఎస్ వదిలిపెట్టబోదని హెచ్చరించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపైనా చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందని ప్రకటించారు,

# ధరలు టాప్

>> 5న ఆదిలాబాద్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.7,450గా ఉన్న ధరతో పోలిస్తే తాజాగా రూ.1,800 పెరగడం విశేషం. అదే ఈ నెల 20న ధరలు రూ.8,500, 21న రూ.8,250కు పెరిగి, 22న రూ.9,260 గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ ధరల పెరుగుదల రైతులకు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, పంట ఉత్పాదకతపై ఆందోళనలు పెరుగుతూనే ఉన్నాయి. మరోపక్క వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నేలలో తేమ సరిపోకపోవడం వల్ల పత్తి మొక్కలు వాడిపోతున్నాయని, కాయలు అకాలంగా పగిలిపోతున్నాయని రైతులు నివేదిస్తున్నారు. పొడి పరిస్థితులు ఇలాగే కొనసాగితే, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ దిగుబడులు తీవ్రంగా పడిపోయి, మొత్తం రాబడిపై ప్రభావం పడుతుందని రైతాంగం భయపడుతోంది.

కాగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 48,21,503 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, తద్వారా మొత్తం 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. జిన్నింగ్ ప్రక్రియ అనంతరం సుమారు 50.68 లక్షల బేళ్ల పత్తి లభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా 131 కొనుగోలు కేంద్రాలను కాటన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.

ఈ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు, పత్తి తూకం, నిల్వ, రవాణా వంటి అంశాలపై తగిన చర్యలు తీసుకున్నారు.

అయితే బయట వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేయడంతో, మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నట్లయితే అప్పుడే కాటన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కేంద్రాలకు తీసుకెళ్లాలని రైతులు భావిస్తున్నారు.

# రెండో పంట వేయొద్దు

>> మంత్రి పొంగులేటి అన్నారు. ఓట్ల తొలగింపు పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమానికి తెలంగాణ నుంచి 20 వేల మంది కార్యకర్తలను తరలించనున్నట్లు వెల్లడించారు.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు మంత్రి సూచించారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశించారు. ఓటు హక్కు పరిరక్షణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, తెల్లం వెంకటరావు, డిప్యూటీ మేయర్ లలితకుమారి, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, ఊకంటి గోపాలరావు, తాళ్లూరి బ్రహ్మయ్య, జడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కార్పొరేటర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం
## జనరల్ మేనేజర్లతో భట్టి విక్రమార్క సమావేశం

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** సింగరేణిని మరింత బలోపేతం చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధి, సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై తాము ప్రత్యేకంగా దృష్టిసారించామని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సింగరేణి జనరల్ మేనేజర్లతో భట్టి విక్రమార్క ఆదివారం ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు.

సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సింగరేణిలోని మొత్తం 66 మంది జనరల్ మేనేజర్లతో ఈ సంస్థ పనితీరుపై ప్రత్యక్షంగా భట్టి విక్రమార్క చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి సాధించిన ప్రగతిని అధికారులు.. భట్టి విక్రమార్కకు వివరించారు. జనరల్ మేనేజర్ల విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయి పనితీరుపై ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, సాధించిన ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. బొగ్గు రవాణా, రేకుల లభ్యత, డిస్పాచ్ వివరాల గురించి ఆయన మాట్లాడారు.

ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనుల్లో ఉత్పత్తి పరిస్థితులపై సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, రవాణా వేగవంతం, లక్ష్యాల సాధనపై అధికారులతో చర్చించారు. సింగరేణి భవిష్యత్ విస్తరణ, కొత్త గనుల అభివృద్ధి ప్రణాళికలపై సమాలోచనలు చేశారు.

సంస్థ ఉత్పాదకత, సామర్థ్యంపెంపు, కార్యాచరణ మెరుగుదలపై భట్టి విక్రమార్క.. అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వార్త

ఇతరుల మాటల్ని శ్రద్ధగా వినేవారు
ప్రతిచోటా తమ పలుకుబడిని పెంచుకుంటారు.

- విల్సన్ మైజ్నర్

# పారా హుషార్!

రాబోయే పది నెలల కాలంలో 'ఎల్‌నినో' మనల్ని ఇబ్బందులకు గురిచేస్తుంది 'పారాహుషార్'అంటూ తెలంగాణ పాలకులు ఇప్పుడు ఊరూవాడా అప్రమత్తం చేస్తున్నారు. హఠాత్తుగా మీదపడిన కోవిడ్ గురించి తెలిసోతెలియకో ముందు జాగ్రత్తలు వహించక సొంత వారి ప్రాణాల్నే కాపాడుకోలేకపోయిన అనుభవాలున్న తెలంగాణ ముందస్తుగానే రాబోయే ప్రమాదాల్ని గుర్తించి సకల జనాన్ని అప్రమత్తం చేయడం అభినందించదగిన విషయమే. ఇది పాలకుల ముందుచూపును తెలియ చేస్తోంది. 'ఎల్‌నినో' ఉధృతంగా మారి రాబోయే రోజుల్లో భారతదేశాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్న హెచ్చరికలతో భారత వాతావరణ సంస్థ ఇప్పటికే మేల్కొల్పింది. చరిత్రలోనే అత్యంత బలమైన ఎల్‌నినోను ఎదుర్కోవాల్సి వస్తుందని దాని ప్రభావాన్ని,అసాధారణ ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం విలవిల్లాడిపోతుంటారని వారి హెచ్చరికల సారాంశం. ఈ యేడాది నవంబరు నుంచి 2027 జనవరి మధ్యకాలంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటుకన్నా 3.8డిగ్రీలసెల్సియస్ వరకు పెరిగే ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఈసారి వర్షాకాలంలో తెలంగాణలో దాదాపు 20 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. దాని ప్రభావం రాష్ట్రంలో పంటలపై పడింది. త్వరలో భూగర్భజల మట్టాలు అడుక్కిపడిపోయి లోతుకు వెళ్లిపోయిన కారణంగా నీటి వసతి సౌకర్యాలు మృగ్యమౌతాయన్న సంకేతాలు లేకపోలేదు. రిజర్వాయర్‌లలో నీటి మట్టాలు 30 నుంచి 40శాతమే ఉన్నాయి. భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటిపోతే యాసంగి వరి సాగు సాధ్యం కాదనే అంచనాతో ప్రభుత్వాలు నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఎండల తీవ్రతతోపాటు సాగు, తాగు నీటి అవసరాలు పెరగడంతో విద్యుత్తు వినియోగమూ పెరిగింది. రాబోయే 7,8 నెలలో వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పించడం కోసం విబిజి రాంజీ పథకం కింద పనులు కల్పిస్తున్నారు. కానీ వారుపనులు చేయడం కోసం మళ్లీ నీటి ఊటల వెంట పరుగెత్తాల్సి ఉంటుంది. ఒక చుక్క నీటి కోసం వెంపర్లాడే పరిస్థితి కళ్లెదుట కళాశిల్పంలా కనపడుతోంది. తెలంగాణలో 358 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తే మరో తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో 388 కరవు మండలాలను ప్రకటించారు. వాటిలో తీవ్ర కరవు 283 మండలాలున్నాయి. కరవు మండలాల ఎంపికలో అనేక ఔచిత్యాలు, వైరుధ్యాలున్నా అక్కడి పరిస్థితుల అంచనాలో ఎవరూ కరవులేదని చెప్పే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు మాత్రం ఆగమేఘాల మీద రైతు జనాలను సైతం అప్ర మత్తం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకాంగ్రెస్ పాలకుల అధీనంలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఏరీతిన సహకరిస్తుందోనన్న భయంతో ముందస్తు జాగ్రత్తలకు త్వరపడుతోంది. ఇప్పటికే వరి సాగుకు అధిక నీరు అవసరం ఉన్నందున శుక్రవారం నాటి మంత్రివర్గ ఉప సంఘ సమావేశంలో రాష్ట్రాన్ని ఎల్‌నినో ప్రభావంతో వెన్నాడే పరిస్థితులపై చర్చసాగింది. ఇందులో పలు ఆసక్తికర వివరాలను బయటపడ్డాయి. అక్టోబరులో వర్షాలుతగి నంతగా పడలేదు. తాజా అంచనా ప్రకారం రాష్ట్రంలో 23.4లక్షల ఎకరాల్లోని పంటల సాగుపై ఎల్‌నినో ప్రభా వం పడింది. సాగు విస్తీర్ణంలో ఇది 18.6శాతం మాత్రమే. ఇందులో పత్తి 15.88 లక్షల ఎకరాల్లో వరి 4.78 లక్షల ఎకరాల్లో ఎండిపోయింది. కంది, మొక్క, మిరప, జొన్న పంటలు ఎక్కువ విస్తీర్ణంలో దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06లక్షల ఎకరాలకు సాగు తగ్గగా, వరి ఒక్కటే 18శాతం తగ్గింది. ఇలా దేశంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. అలా తగ్గిన తొలి ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, మహారాష్ట్రాలు కూడా తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నాయి. తెలంగాణలో 621 మండలాల్లో 324 మండలాల్లో భూగర్భ జలాలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లలో తాగునీటికి మాత్రమే సరిపడే నీటి నిల్వలు ఉన్నందున రేపటి ఖరీఫ్ ఆరంభం వరకే తాగునీటికి వాడుకోవాలి. ఈలోగా జలాశయాల్లోని నీటి తోడకానికి పంపింగ్ వ్యవస్థలను సిద్ధం చేయడానికిఅన్ని ఏర్పాట్లు చేసుకోవాల్సిన ఆవశ్యకతను నీటిపారుదల ప్రతి పాదించింది. దాంతో ఆయా మండలాల్లో ఆవశ్యకతల రీత్యా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం నిధుల విడుదల చేసింది. రాష్ట్రంలోని భారీ మధ్యతరహా ప్రాజెక్టుల నీరు నిల్వసామర్థ్యం 470.2టిఎంసిలు కాగా 179.6 టిఎంసిల నీటి నిల్వలే ఉన్నాయి. వాటిలో మిషన్ భగీరథకు 50 టిఎంసిలు పోగా, మిగిలిన వాటిలో హైదరాబాద్‌లో తాగు నీటి అవసరాలకు 20 టిఎంసిలు తాత్కాలికంగా అవసరమవుతాయి. ఇతర పురపాలికలు, పరిశ్రమలకు మరో 15 టిఎంసిలు కేటాయించారు. అంటే నీటి సరఫరాలోని సంక్లిష్టతలను క్రమబద్ధం చేయాలంటే ప్రత్యామ్నాయాలకై అన్వేషించాలి. గతంలో కన్నా ఈ యేడాది విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం బాగా దెబ్బతింది. పశుదాణాకు బాగా కొరత ఏర్పడి పశువులకు ప్రాణసంకటంగా మారినందున ఎండాకాలం వచ్చేలోగానే 2వేల టన్నుల పశుగ్రాసాన్ని సమీకరించుకోవాలి. ఒక్క పశుగ్రాసం సమకూర్చుకునేందుకే దాదాపు రూ.100 కోట్ల నిధులు కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో తాజా ఇబ్బందులను ఎదుర్కొంటూనే, ఇకపై ఎదురయ్యే సమస్యలకు నిధులు సమకూర్చుకునే యోచనలో ప్రభుత్వం సకల అవస్థలు పడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తోంది.

మనుషులందరూ మట్టి నుంచి వచ్చినవాళ్లే. వారు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేద్కర్



సంపన్నమైన హృదయం లేనప్పుడు, ఎంత సంపద ఉన్నప్పటికీ అది వికారమైన బిచ్చగాడిలా కన్పిస్తుంది.

ఎమర్సన్



# కాలుష్యం కట్టడికి తాత్కాలిక ఆంక్షలేనా?

**ఢిల్లీకి కావాల్సింది ఏడాది పొడవునా అమలయ్యే, స్పష్టమైన లక్ష్యాలు, పారదర్శక పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన అమలు వ్యవస్థ కలిగిన కార్యాచరణ. నగరపాలక సంస్థలు, రవాణా అధికారులు, కాలుష్య నియంత్రణ సంస్థలు, రాష్ట్రప్రభుత్వాలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేయాలి. చేపట్టిన చర్యలు ఉద్గారాలను ఎంత వరకు తగ్గిస్తున్నాయో ప్రజలకు అందుబాటులో ఉండే నివేదికల ద్వారా వెల్లడించాలి. పౌరులు చెత్తను బహిరంగంగా కాల్చకపోవడం, వ్యర్థాలను సక్రమంగా పారవేయడం, సాధ్యమైనంతవరకు ప్రజారవాణాను వినియోగించడం ద్వారా సహకరించవచ్చు. అయితే,బలహీనమైన ప్రభుత్వ విధానాలను వ్యక్తిగత బాధ్యతతో మాత్రమే భర్తీచేయలేం. గ్రాప్ మొదటి దశ అమలు తక్షణ అవసరమే.కానీ దాన్ని శాశ్వత పరిష్కారంగా కాకుండా హెచ్చరికగా చూడాలి. కాలుష్యం మరో ప్రమాదకర స్థాయికి చేరకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఉండకూడదు.**

డి వి బి శ్రీహరిన్

అక్టోబర్ 21న ఢిల్లీలో గాలి నాణ్యత పేలవం స్థాయికి పడిపోవడంతో జాతీయ రాజధాని ప్రాంతం అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) మొదటి దశను అమలు చేయాలని వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ ఆదేశించింది. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు గాలి నాణ్యత సూచీ 244గా నమోదవగా, సాయంత్రం 4 గంటలకు 245కు చేరింది. ఈ స్వల్ప పెరుగుదల కంటే, ప్రతి ఏడాది పునరావృతమవుతున్న కాలుష్య సంక్షోభం మరోసారి మొదలైందన్న విషయమే ఆందోళన కలిగిస్తోంది. సమస్య ముదిరిన తర్వాత అత్యవసర చర్యలకు దిగడం ఢిల్లీకి అలవాటుగా మారింది. గాలి నాణ్యత క్షీణించినప్పుడు కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు గ్రాప్ అవసరమే. మొదటి దశలో రోడ్లపై దుమ్ము, నిర్మాణ పనుల కాలుష్యం, వాహనాల పొగ, పారిశ్రామిక ఉద్గారాలు, బహిరంగంగా చెత్తను కాల్చడం వంటి అంశాలపై నియంత్రణ చర్యలు చేపడతారు. అయితే, అత్యవసర ఆంక్షలు ఏడాది పొడవునా అమలయ్యే సమగ్ర కాలుష్య నియంత్రణ విధానానికి ప్రత్యామ్నాయం కాలేవు. కాలుష్యం పెరిగిన తర్వాతే చర్యలు ప్రారంభిస్తే, సమస్యను నివారించడానికి బదులు దాని ప్రభావాలను ఎదుర్కొనే చక్రంలోనే నగరంచిక్కుకుపోతుంది. ఢిల్లీలో కాలుష్యానికి వాహనాల పొగ, రోడ్ల నిర్మాణ ప్రదేశాల నుంచి వెలువడే దుమ్ము, పారిశ్రామిక ఉద్గారాలు, చెత్త దహనం, పంట అవశేషాల కాల్చివేత వంటి అనేక కారణాలున్నాయి. తక్కువ ఉష్ణోగ్రతలు, గాలుల వేగం తగ్గడం వంటి వాతావరణ పరిస్థితులు కాలుష్య కారకాలు భూమికి సమీపంలోనే పేరుకుపోయేలా చేసి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. అయితే, వాతావరణం కాలుష్యాన్ని పెంచవచ్చేమో కానీ, అధిక ఉద్గారాలకు అదే కారణం కాదు. చలికాలంలో కాలుష్యం తప్పదనే భావన, నివారించగలిగిన విధానపరమైన వైఫల్యాల నుంచి దృష్టిని మళ్లిస్తుంది. నిబంధనలు లేకపోవడం కంటే, ఉన్న నిబంధనలను సక్రమంగా అమలు చేయకపోవడమే ప్రధాన సమస్య. నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము నియంత్రణ, నిర్మాణ సామగ్రి సురక్షిత రవాణా, కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలు పరిశ్రమలపై సమర్థ పర్యవేక్షణ తప్పనిసరి. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం, కాలుష్యం పెరిగినప్పుడు మాత్రమే కఠిన చర్యలు తీసుకోవడం సరిపోదు. రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, నిర్మాణ వ్యర్థాలను సక్రమంగా తొలగించడం, నిరంతర పర్యవేక్షణ, ఉల్లంఘనలకు తగిన జరిమానాలు విధించడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగం కావాలి. రవాణా విధానంలోనూ మౌలిక మార్పులు అవసరం. ప్రజారవాణా వ్యవస్థ నమ్మదగినదిగా లేకపోతే, రద్దీగా ఉంటే లేదా నివాస ప్రాంతాలు, కార్యాలయాలకు సరైన అనుసంధానం లేకపోతే ప్రజలు వ్యక్తిగత వాహనాలను వదిలిపెట్టడం కష్టం. బస్సు సేవలను మెరుగుపరచడం,చివరి మైలు వరకు రవాణా సౌకర్యాలు కల్పించడం, నడిచేవారికి సురక్షిత మార్గాలు, సైక్లింగ్‌కు అనువైనమౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం ద్వారా కాలుష్యం తక్కువగా ఉండే ప్రయాణ విధానాలను ప్రోత్సహించవచ్చు. తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే వాహనాలు అవసరమే.అయితే, వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం కూడా అంతే ముఖ్యం. పారిశ్రామికాభివృద్ధి, పట్టణీకరణ పర్యావరణ నిబంధనలకు లోబడి సాగాలి. నిర్మాణ సంస్థలు దుమ్ము, వ్యర్థాల నిర్వహణపై బాధ్యత వహించాలి. పరిశ్రమలు ఉద్గార ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలి. స్వచ్ఛమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో చిన్న పరిశ్రమలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అవసరమవవచ్చు. అయితే, ఈ సహాయాన్ని నిరంతర ఉల్లంఘనల



ను సహించడానికి సాకుగా ఉపయోగించకూడదు. పంట అవశేషాల దహనం సమస్యకు కూడా ఆచరణాత్మక పరిష్కారాలు అవసరం. పంటల మధ్య వ్యవధి తక్కువగా ఉండటం, యంత్రాలఖర్చు అధికంగా ఉండటం, అవశేషాల నిర్వహణకు ప్రత్యామ్నాయాలు అందుబాటులో లేకపోవడం రైతులను ఈ పద్ధతికి నెట్టే అంశాలు. కేవలం శిక్షలు విధించడం వల్ల సమస్య పరిష్కారం కాదు. పంట అవశేషాల నిర్వహణ యంత్రాలను అందుబాటులోకి తేవడం, సకాలంలో సాంకేతిక సహాయం అందించడం, వ్యవసాయ వ్యర్థాలను ఇతర అవసరాలకు వినియోగించే మార్గాలను అభివృద్ధి చేయడం కీలకం. వాయు కాలుష్యానికి రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావు కాబట్టి ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాలి. కాలుష్యంతో కలిగే ఆర్థిక నష్టాన్ని తరచుగా తక్కువగా అంచనా వేస్తున్నారు. కలుషిత గాలి శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధుల ముప్పును పెంచుతుంది. వైద్య ఖర్చులు, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై భారం కూడా అధికమవుతాయి. అనారోగ్యం, అలసట, విధులకు గైర్హాజరు కావడం వల్ల ఉత్పాదకత తగ్గుతుంది. నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, రవాణా రంగంలో పనిచేసేవారు వంటి బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువ సమయం గడిపే వారికి ప్రమాదం మరింత ఎక్కువ. పిల్లలు, వృద్ధులు, ఇప్పటికే అనారోగ్య సమస్యలున్నవారూ తీవ్రంగా ప్రభావితమవుతారు.ఈ ప్రభావాలు ఆసుపత్రులు, కుటుంబాలకే పరిమితం కావు. పని దినాలు కోల్పోవడం, వైద్య ఖర్చులు పెరగడం, నివారించగలిగిన అనారోగ్యాల కారణంగా కుటుంబాలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఆర్థిక వనరులపై అదనపు భారం పడుతుంది. పర్యావరణ పరిస్థితులు నిరంతరం దిగజారితే నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, పెట్టుబడిదారులకు నగరంఆకర్షణ కోల్పోవచ్చు. అందువల్ల స్వచ్ఛమైన గాలి ఆర్థికాభివృద్ధి తర్వాత చూసుకోవాల్సిన అంశం కాదు. అభివృద్ధిదీర్ఘకాలం కొనసాగడానికి అవసరమైన ప్రాథమిక పరిస్థితి. కాలుష్య భారం అందరిపైనా సమానంగా పడదు. ఆర్థికంగా స్థితిమంతులైన కుటుంబాలు గాలి శుద్ధి పరికరాలు కొనుగోలు చేయగలవు లేదా తాత్కాలికంగా వేరే ప్రాంతాలకు వెళ్లగలవు. పేద కుటుంబాలకు అలాంటి అవకాశాలు ఉండవు. రోజువారీ కూలీపై ఆధారపడేవారు కాలుష్యం పెరిగినప్పుడు పనికి వెళ్లకుండా ఉండలేకపోవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలా, కుటుంబ అవసరాల కోసం సంపాదించాలా అనే సంకటంలో పడతారు. కాబట్టి కాలుష్య నియంత్రణ విధానాల్లో ఈ అసమానతలను గుర్తించి, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సూచనలు, కార్మికులకు మెరుగైన రక్షణ, అత్యధికంగా ప్రభావితమయ్యే వర్గాలకు ప్రత్యేక సహాయం అందించాలి. ఢిల్లీకి కావాల్సింది ఏడాది పొడవునా అమలయ్యే, స్పష్టమైన లక్ష్యాలు, పారదర్శక పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన అమలు వ్యవస్థ కలిగిన కార్యాచరణ. నగరపాలక సంస్థలు, రవాణా అధికారులు, కాలుష్య నియంత్రణ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేయాలి. చేపట్టిన చర్యలు ఉద్గారాలను ఎంత వరకు తగ్గిస్తున్నాయో ప్రజలకు అందుబాటులో ఉండే నివేదికల ద్వారా వెల్లడించాలి. పౌరులు చెత్తను బహిరంగంగా కాల్చకపోవడం,వ్యర్థాలను సక్రమంగా పారవేయడం, సాధ్యమైనంతవరకు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా సహకరించవచ్చు. అయితే, బలహీనమైన ప్రభుత్వ విధానాలను వ్యక్తిగత బాధ్యతతో మాత్రమే భర్తీ చేయలేం. గ్రాప్ మొదటి దశ అమలు తక్షణ అవసరమే. కానీ దాన్ని శాశ్వత పరిష్కారంగా కాకుండా హెచ్చరికగా చూడాలి. కాలుష్యం మరో ప్రమాదకర స్థాయికి చేరకుండా అడ్డుకోవడమేలక్ష్యంగా ఉండకూడదు. ఆ స్థాయికి చేరే పరిస్థితులనే ముందుగా నివారించాలి. అందుకు నిరంతర రాజకీయ సంకల్పం, దీర్ఘకాలిక పెట్టుబడులు,జాతీయ రాజధాని ప్రాంతంలోని ప్రభుత్వాల మధ్య ఏడాదిపొడవునా సమన్వయం అవసరం.ప్రజారోగ్యం, ఉత్పాదకత, జీవన ప్రమాణాలను దెబ్బతీసే అభివృద్ధి నిజమైన పురోగతి అనిపించుకోదు.ఢిల్లీ కాలుష్యసంక్షోభానికి పరిష్కారం మరోవిడత తాత్కాలిక ఆంక్షల్లో లేదు. నిరంతర పర్యవేక్షణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, కఠినమైన నిబంధనల అమలు, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా కాలుష్యాన్ని ముందుగానే నివారించడంలోనే ఉంది. ●

# ఇంటర్నెట్ విస్తరణతో సమాచార భద్రతకు సవాళ్లు!

సి.హెచ్. ప్రతాప్

సాంకేతిక ప్రగతిఅంతరిక్షాన్ని అందుకుంటున్నా దేశంలోని అనేక మారుమూల గ్రామాలకు నేటికీ నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందడం లేదు. నగరాల్లో డిజిటల్ విప్లవం పరుగులు తీస్తుంటే కొండప్రాంతాలు, అటవీ గ్రామాల్లో సమాచార సౌకర్యాల కొరత కొనసాగుతోంది. ఈ సమస్యకు ఉపగ్రహ ఇంటర్నెట్ ఆశాజనకమైన పరిష్కారంగా ముందుకొస్తోంది. అయితే దీని విస్తరణతో పాటు సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యమివ్వాలి. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాల ప్రకారం 2026 మార్చి నాటికి దేశంలో ఇంటర్నెట్‌కనెక్షన్ల సంఖ్య 109.28 కోట్లకు చేరింది. జూన్ నాటికి 111.42 కోట్లకు పెరిగింది. వీటిలో 106.64 కోట్ల కనెక్షన్లు వైర్‌లెస్ ఆధారితమైనవే. మారుమూల ప్రాంతాల్లో టెలికాం మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అధిక వ్యయం, భౌగోళిక అవరోధాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఉపగ్రహ సేవలతో వీటిని కొంతవరకు అధిగమించవచ్చు. సాధారణఇంటర్నెట్ సేవలకు భూగర్భ కేబుళ్లు, సెల్ టవర్లు అవసరం. భూమికి సమీప కక్ష్యల్లో పరిభ్రమించే ఉపగ్రహాల ద్వారా విస్తారమైన ప్రాంతాలకు సమాచార సేవలను అందించవచ్చు. గ్రామీణ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు, రైతులకు వాతావరణ సూచనలు, పంటల ధరల సమాచారం, మారుమూల వైద్యకేంద్రాలకు నిపుణుల సలహాలు అందించడంలో ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. వరదలు, తుఫానుల సమయంలో భూమిపై సమాచార వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు ప్రత్యామ్నాయ సమాచార మార్గంగానూ సేవలందించగలదు. అయితే ఉపగ్రహ ఇంటర్నెట్ వినియోగంలో కొన్ని భద్రతాపరమైన ముప్పులున్నాయి. ఇళ్లలో ఏర్పాటు చేసే రిసీవర్లు, రౌటర్లలో భద్రతా లోపాలుంటే హ్యాకర్లు వాటిని నియంత్రించే ప్రమాదముంది. సరైన సాంకేతీకరణ లేకపోతే వ్యక్తిగత సమాచారం అనధికార వ్యక్తులకు చిక్కవచ్చు. నకిలీ సంకేతాలతో సమాచార వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం, రేడియో సంకేతాలకు అంతరాయం కలిగించడం వంటి సమస్యలూ తలెత్తవచ్చు. ఉపగ్రహ సేవలను నిర్వహించే భూకేంద్రాలపై సైబర్‌దాడులు జరిగితే అనేక ప్రాంతాల్లో సమాచార సేవలు నిలిచిపోయే అవకాశముంది.అత్యవసర సమయాల్లో ఇటువంటి అంతరాయాలు సహాయక చర్యలను దెబ్బతీస్తాయి. ఈ ప్రమాదాల నివారణకు బలమైన సాంకేతీకరణ, సాఫ్ట్‌వేర్ భద్రతా నవీకరణలు, స్వతంత్ర సాంకేతిక తనిఖీలు అవసరం. వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, పరికరాల స్థాన సమాచారానికి రక్షణ కల్పించాలి.ఉపగ్రహ సేవలను సంప్రదాయ టెలికాం వ్యవస్థకు అనుబంధంగా అభివృద్ధి చేయాలి. పరికరాల ధరలు, నెలవారీ చార్జీలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడంతోపాటు ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.అంతరిక్షం నుంచి అందేఇంటర్నెట్ సామాన్యుడి జీవితంలో వెలుగులు నింపాలి. సాంకేతిక విస్తరణకు ప్రజల సమాచార భద్రత, ఆర్థిక స్థోమత, అవసరాలే ప్రామాణికం కావాలి. ●



# ప్రజావాక్కు

## దమ్మున్న వ్యక్తికి ఓటు వేయండి

ఓటు వేసే ముందు కొంచం ఆలోచించి వేయండి. ఓటు ఎవరికివేద్దాం? మనకులం వాడని, మన మతం వాడని, ఈ ఒక్కసారి అని ఓటేస్తేగతంలో 2019 నుండి 2024 వరకు ఎలా బాధలు పడ్డామో ఆలోచించండి. పొరపాటున ఆలోచించకుండా వేస్తే మరలా ఐదు సంవత్సరాలు ఇబ్బందులుతప్పవు.డబ్బుకు అమ్ముడుపోవద్దు.సారాయికి అమ్ముడు పోవద్దు.అవినీతికి దూరంగా, అక్రమాలకు దూరంగా,ప్రజాస్వామ్యబద్ధంగా,లౌకికవాదానికి అను కూలంగా, విలువలతో ధైర్యంగా ఎవరైతే పనిచేస్తారో వారికి ఓటు వేయండి. ప్రజాస్వామ్యవాదినీ ఎన్నుకుంటే, లౌకికవాదినిఎన్నుకుంటే,అవినీతికి దూరంగాఉండేవారినీ ఎన్నుకుంటే మనం చెప్పినట్లు వింటాడు. పాలనబాగుంటుంది. అదే డబ్బుతీసుకుని, సారాయికి అమ్ముడుపోతే ప్రశ్నించే హక్కును కోల్పోతాము.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విమాన భద్రతకు కొత్త సవాళ్లు

విమాన ప్రయాణాల్లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఎంత సాధారణమయ్యాయో పవర్‌బ్యాంక్‌ల వినియోగం కూడా అంతే పెరిగింది. అయితే నాణ్యతలేని లిథియం అయాన్ బ్యాటరీలు విమాన భద్రతకు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఇటీవలి అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో డీజీసీఏ ఒక నిర్దిష్ట పవర్ బ్యాంక్ మోడల్‌పై నిషేధం విధించిందన్న పరిణామం, ప్రయాణ సమయంలోఎలక్ట్రానిక్ పరికరాల భద్రతపై మరింత అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేస్తోంది. లిథియంఅయాన్ బ్యాటరీల్లో తయారీ లోపాలు,నాసిరకం సెల్స్,అంతర్గత షార్ట్‌సర్క్యూట్ లేదా దెబ్బతినడం వల్ల అధిక వేడి ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంటుంది. విమానంలో ఇలాంటి ఘటన ఎదురైతే పరిస్థితిని అదుపు చేయడం అత్యంత కీలకం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## డ్రిప్ ఇరిగేషన్‌వైపు దృష్టిసారించాలి

తెలంగాణా చిన్న నీటి వనరులపైన ఎక్కువ ఆధారపడుతూఉంటుంది.నిజానికి ప్రభుత్వలెక్కల ప్రకారమే 53వేల చెరువులు ఉన్నాయి.ఇప్పుడు ఎల్‌నీనో సమయం. కాబట్టి రబీ సీజన్లో రైతులువాళ్ళ పొలంలో ఒక గుంట స్థలంలో పంట కుంట తవ్వుకోవడం, చెరువు మట్టిని తీసుకొని వెళ్లి పంట పొలాలలో వేసుకోవడం. అంతేకాదు ప్రతి రైతు డ్రిప్ వైపు మళ్లెలా అవగాహనా కల్పించాలి.

- భారత అవినాష్, జనగామ

## ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుల వారు ఏం మాట్లాడుతున్నారో వినేవారికి వెగటు పుట్టిస్తున్నాయి. ఫ్రాన్స్‌లో అల్లర్లు చెలరేగడానికి విదేశాల నుంచి వచ్చిన వలసదారులేనట. వారిని వారి దేశాలకు పంపించి వేయాలని ఫ్రాన్స్ ప్రభుత్వానికి అడక్కపోయినా సలహా యిచ్చారు. అమెరికాలో భారతీయులతో బాటు అనేక మంది విదేశీ ప్రముఖులు మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అనే స్లోగన్ ట్రంప్ అనక ముందే వెరీ గ్రేట్‌ను చేసారు. నాసా అంతరిక్ష కేంద్రంలో అనేక మంది భారతీయ ఇంజనీర్లు, సైంటిస్టులు అనేకవిజయాలను మూటగట్టి అమెరికాను గొప్ప దేశంగా నిలబెట్టారు. ఈ వాస్తవాలు ట్రంప్‌కు తెలియవా? మాజీ అమెరికా అధ్యక్షులైన రోనాల్డ్ రీగన్, బరాక్ ఒబామా లాంటి వారు విదేశీ మేధావులు తమ దేశానికి వచ్చి దేశ పురోగతికి బాటలువేయడం గర్వించదగ్గ విషయం అనిఅన్నారు. ఇప్పుడు ట్రంప్ ఏచిన్న సమాజ హితం కాని సంఘటన జరిగినా దానిని విదేశీయులకు అంటగడుతున్నారు. ఇష్టం వచ్చిన రీతిలో సుంకాలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఇటువంటి చవకబారు చపలచిత్త ఆలోచనారహిత అధ్యక్షునిగా మరల ఎన్నుకోవాలా? ఓట్లేసే అమెరికా ప్రజలు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఒకే పోలీస్ స్టేషన్‌లో ఒకేవ్యక్తిపై 10కి పైగా కేసులు నమోదై సంవత్సరకాలం గడిచిన కూడా ఆవ్యక్తిని కనీసం పోలీస్ స్టేషన్‌కు పోలీస్ అధికారులు పిలిపించడం లేదు. ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలరూపాయలు వసూలుచేయడం,రాష్ట్ర మంత్రుల పేరుతో, పార్లమెంటుసభ్యులు, శాసనసభ్యుల పేరుతో మోసాలు చేయడం, బాండ్ పేపర్ పై అప్పు కాగితాలు రాసి ఇవ్వడం,వారి కుటుంబ సభ్యులు పోలీస్ డిపార్ట్మెంట్‌లో పని చేస్తుండడంతో పోలీస్ అధికారుల అండదండలతో అవినీతి అక్రమాలు చేస్తున్న వ్యక్తులపై సంబంధిత బాధితులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## మిత్రులను మరవద్దు

మన జీవితకాలంలో మనకు అన్నివిషయాలలో వెంటనే స్పందించి అడుగడుగునా అండగా నిలిచిన మిత్రులను, శ్రేయోభిలాషులను మరవకూడదు.సంబంధ బాంధవ్యాలు బలపడాలంటే విపత్కర పరిస్థితుల్లో ఒకరికొకరు సహాయ సహకారాలు చేసుకోవాలి. మన జీవితంలో మిత్రులు కీలక పాత్రలు పోషిస్తారు.ఎప్పుడైనా చుట్టూరా మంచి మిత్రులు కలిగి ఉంటే విజయాలు సులభంగా సాధించవచ్చు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# డ్రగ్స్ నిర్మూలన ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం



మేకిరి దామోదర్

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించడం మనకు ఒక గొప్ప అవకాశమే కాదు. అంతకుమించిన బాధ్యత కూడా!యువత శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోగలిగితే ఆర్థికాభివృద్ధిలో దేశం అగ్రగామిగా నిలవగలదు. కానీ నిరుద్యోగం, నైపుణ్యాల కొరత, ఉపాధి అవకాశాల లేమి, మాదకద్రవ్యాల వ్యసనం వంటి సమస్యలు యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయి. ఒకవైపు చదువుకున్నా కొలువులు లభించక యువత నిరాశకు గురవుతుంటే, మరోవైపు కొందరు మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. యువతకు ఉపాధి భరోసా కల్పించడం, డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం కావాలి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) వంటి నివేదికలు యువతలో విద్య, శిక్షణ, ఉపాధికి సంబంధించిన సమస్యలను వెలుగులోకి తెస్తున్నాయి. దేశవ్యాప్తంగా 15-29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో గణనీయమైన శాతం మంది చదువులోనూ, ఉద్యోగాల్లోనూ, వృత్తి నైపుణ్య శిక్షణలోనూ లేకపోవడం ఆందోళనకరం. ఆర్థిక ఇబ్బందులు, నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించకపోవడం వంటి కారణాలు యువత అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. చదువులు పూర్తిచేసినా తగిన ఉద్యోగం దొరకకపోవడంతో చాలా మంది నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మధ్య సమన్వయం కొరవడటంతో డిగ్రీలు ఉన్నా ఉపాధి పొందలేని పరిస్థితి నెలకొంటోంది.ఉద్యోగాల కోసం యువత రోడ్లెక్కి ఆందోళనలు చేయాల్సివస్తోంది. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో జాప్యం చేస్తే నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతుంది. వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సింది పోయి, ప్రశ్నించే యువతను ప్రత్యర్థులుగా చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికివిరుద్ధం.నిరసనల వెనుక ఉన్ననిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, భవిష్యత్తుపై అభద్రత వంటి కారణాలను పాలకులు అర్థం చేసుకోవాలి. మహిళల విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉన్నత విద్య అభ్యసిస్తున్నప్పటికీ కుటుంబ బాధ్యతలు, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాల కొరత, కార్యాలయాల్లో అనుకూల వాతావరణం లేకపోవడం వంటి కారణాలతో చాలామంది ఉద్యోగాలకు దూరమవుతున్నారు.మహిళలకు ఉపాధి అవకాశాలు, సమానఅవకాశాలు, నైపుణ్య శిక్షణ కల్పించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి వారి సేవలను ఉపయోగించుకోవచ్చు.యువతకు నాణ్యమైనవిద్య, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, పారదర్శక నియామకాలు, స్వయం ఉపాధికి అవసరమైన తోడ్పాటుఅందించాలి. ఖాళీగా ఉన్న సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకునేలా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా



కార్యక్రమాలను ప్రోత్సహించాలి.నిరుద్యోగం ఒక్కటే మాదక ద్రవ్యాల వినియోగానికి కారణమని చెప్పలేం. స్నేహితుల ఒత్తిడి,కొత్తదనం చూడాలనే ఆసక్తి, మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలు, వ్యసనానికి సంబంధించిన ఇతర పరిస్థితులు కూడా యువతను ఆ దిశగా నడిపించవచ్చు. అందుకే ఉపాధి కల్పనతోపాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన, కుటుంబ ఆదరణ,సానుకూల సామాజిక వాతావరణం కూడా అవసరం. మాదకద్రవ్యాల వినియోగం ఇప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన సమస్య కాదు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల పరిసరాల్లోనూ ఈ ముప్పు విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. చిన్న వయసులోనే మత్తు పదార్థాల పరిచయం ఏర్పడితే విద్యాభ్యాసం, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, భవిష్యత్తు లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సరదా కోసమో, స్నేహితుల ప్రోత్సాహంతోనో మొదలైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారే ప్రమాదం ఉంది. దీనివల్ల శారీరక,మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు చదువుపై ఏకాగ్రత తగ్గి, కుటుంబాల్లో ఆందోళన పెరుగుతుంది. కొందరు వ్యసనానికి అవసరమైన డబ్బుకోసం నేరాలకు పాల్పడే ప్రమాదమూ ఉంది. మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారులు తమ స్వార్థ లాభాల కోసం యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి ఉపేక్ష ఉండకూడదు. డ్రగ్స్ సరఫరా మార్గాలను గుర్తించడం, అక్రమ రవాణాను అడ్డుకోవడం, విక్రయ కేంద్రాలపై నిఘా పెట్టడం, అంతరాష్ట్ర ముఠాలపై సమన్వయంతో దర్యాప్తు చేయడం అత్యవసరం. పట్టుబడిన చిన్నస్థాయి వినియోగదారులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం కాకుండా, అసలు సరఫరాదారులు, నిర్వాహకులు, ఆర్థికంగా అండగా నిలిచే నెట్‌వర్క్‌లను చట్టపరంగా కట్టడి చేయాలి. చట్టాల అమలులో పారదర్శకత, దర్యాప్తులో వేగం, నేర నిరూపణకు సమర్థమైన చర్యలు ఉండాలి. కేంద్ర ప్రభుత్వం చేపట్టే మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమాలు ప్రజా ఉద్యమాలుగా మారాలి. అయితే ప్రచారాలు, నినాదాలకే పరిమితం కాకుండా వాటి ఫలితాలను నిరంతరం సమీక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు శాఖలు, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించాలి. అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే విద్యార్థులను అవమానించకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన సహాయం అందించాలి. వ్యసనానికి లోనైనవారిని నేరస్థులుగా ముద్రవేయకుండా వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ద్వారా సాధారణ జీవనంలోకి తీసుకురావాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. భయపెట్టి, శిక్షించి సమస్యను దాచిపెట్టేలా చేయకుండా, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవాలి. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు జీవన నైపుణ్యాలు, ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, మంచి చెడులను విచక్షణతో గుర్తించే సామర్థ్యాన్ని నేర్పాలి. యువజన సంఘాలు, క్రీడాసంస్థలు,సామాజిక కార్యకర్తలుమాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన ఉపాధిహామీలను కార్యాచరణలో చూపాలి. ఖాళీఉద్యోగాలను భర్తీచేయడం, నైపుణ్య శిక్షణను విస్తరించడం, చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం అందించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. నిరుద్యోగసమస్యను పరిష్కరించడం ఒకవైపు,మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారాన్ని అణచివేయడం మరోవైపు సమాంతరంగా సాగాలి.యువతకు భవిష్యత్తుపై ఆశ కల్పించినప్పుడే వారు దేశాభివృద్ధిలో భాగస్వాములవుతారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం, ఉపాధి భరోసా కలిగిన యువతఈ రెండు లక్ష్యాలు నెరవేరినప్పుడే వికసిత భారత స్వప్నం సాకారమవుతుంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కరవు పరిస్థితులపై 28న అఖిలపక్ష సమావేశం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఎల్‌నినో, వర్షాభావం నేపథ్యంలో తెలంగాణలో ఏర్పడిన కరవు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28న అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కీలక సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా తాగునీటి లభ్యత, నీటి పొదుపు, సంరక్షణ, వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాపై చర్చించనున్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటల (యాసంగి) ప్రణాళికలు, కరువు మండలాల గుర్తింపు వంటి ముఖ్య అంశాలపై ఇందులో నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో వర్షభావ పరిస్థితులు, కరువు ముప్పు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు మరియు తాగునీటి ఎద్దడిపై ప్రధానంగా చర్చించనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన కరువు నిధుల విడుదల కోసం నవంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవడానికి ఒక అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని పంపే యోచనలో ప్రభుత్వం ఉంది. దీనిపై కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు రానుంది. ఇప్పటికే ఈ నెల 31 నాటికి రాష్ట్రంలోని కరువు మండలాలను గుర్తించి అధికారికంగా ప్రకటించాలని సబ్ కమిటీ లక్ష్యంగా పెట్టుకుంది.

## కెసిఆర్ మళ్లీ సిఎం కావాలని ఆకాంక్షిస్తూ కావలి రాంచందర్ పాదయాత్ర

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ పలువురు పాదయాత్రలు చేస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం అంకెల్ల గ్రామానికి చెందిన అభిమాని కావలి రాంచందర్ పాదయాత్ర చేసి ఆదివారం పార్టీ అధినేత కేసీఆర్‌ని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిడ్నాప్, దాడి

### వ్యాపారవేత్తతోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు

**సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఆర్థిక లావాదేవీల కారణంగా ఏర్పడిన విభేదాలతో గచ్చిబౌలిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కిడ్నాప్ చేసి దాడి చేయడం సంచలనంగా మారింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడిన వ్యాపారవేత్తతో పాటు మరో ఇద్దరు మీద గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లికి చెందిన పి. శ్యామ్(25) గోపనపల్లి ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అనకాపల్లికి చెందిన శ్యామ్ స్నేహితుడు భార్గవ్(26) కీసర పరిధిలోని నాగారంలో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భార్గవ్ శనివారం రాత్రి శ్యామ్ ఉంటున్న గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ కు రాగా, ఇద్దరు కలిసి మద్యం సేవించి పార్టీ చేసుకున్నారు. కాగా శ్యామ్ గతంలో తన దగ్గర బంధువైన వ్యాపారవేత్త ఉదయ్ కిరణ్(45) కంపెనీలో కొంతకాలం పనిచేశాడు.



కిడ్నాప్‌కు గురైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్యామ్

అనకాపల్లికు చెందిన ఉదయ్ కిరణ్ కొండాపూర్‌లో బిజ్ గేజ్ సాఫ్ట్‌వేర్, ఆటోమేషన్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఉదయ్ కిరణ్ కంపెనీలో శ్యామ్ పనిచేసిన సమయంలో రెండు అపార్ట్‌మెంట్ ప్లాట్లను శ్యామ్ పేరు మీద ఉదయ్ కిరణ్ కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్లాట్‌లకు శ్యామ్ పేరు మీద లోన్లు తీసుకున్నట్టు సమాచారం. ఈ ఆర్థిక లావాదేవీల విషయమై ఇద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్గవ్‌తో కలిసి మద్యం సేవిస్తున్న శ్యామ్ వద్దకు వచ్చిన ఉదయ్ కిరణ్ మరో ఇద్దరితో కలిసి శ్యామ్‌ను బలవంతంగా కిడ్నాప్ చేసి కారులో ఎక్కించుకొని వెళ్లిపోయాడు. అక్కడి నుంచి కొండాపూర్‌లోని తన కార్యాలయానికి తీసుకువెళ్లిన ఉదయ్ కిరణ్ తన అనుచరులు రాకేష్, రవితేజలతో కలిసి శ్యామ్ మీద దాడి చేశారు. శ్యామ్‌ను బెదిరించి ఆర్థిక లావాదేవీలపై పలు డాక్యుమెంట్ల మీద సంతకాలు తీసుకున్నారు. కాగా శ్యామ్‌ను కారులో కిడ్నాప్ చేసి తీసుకువెళ్లిన విషయమై భార్గవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనితో పోలీసులు రంగంలోకి దిగి శ్యామ్‌ను కొండాపూర్‌లో గుర్తించి రక్షించారు. కిడ్నాప్‌కు పాల్పడిన వ్యాపారవేత్త ఉదయ్ కిరణ్ అతని అనుచరులు రాకేష్, రవితేజపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




ఆదివారం అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నశా ముక్త్ భారత్ సైకిల్ ర్యాలీ ముగింపు సందర్భంగా ప్రసంగిస్తున్న ఎంపి కె.లక్ష్మణ్, చిత్రంలో భరత్‌గౌడ్, వినయ్‌కుమార్, కె.రాహుల్ తదితరులు

## డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యంగా యువత అప్రమత్తంగా ఉండాలి : ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), అక్టోబరు 25, ప్రభాతవార్త :** దేశ భవిష్యత్తు, పురోగతి పూర్తిగా యువత చేతుల్లోనే ఉందని, అయితే పొరుగు దేశాలు మన దేశ యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడేలా కుట్రలు పన్నుతున్నాయని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నశాముక్త్ భారత్ సైకిల్ ర్యాలీలో డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రారంభించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సైకిల్ ర్యాలీ దాదాపు 8 కిలోమీటర్లు కొనసాగి అశోక్ నగర్ చౌరస్తా వద్ద ముగిసింది. డాక్టర్ కె. లక్ష్మణ్ స్వయంగా సైకిల్ తొక్కుతూ అవగాహన కల్పించారు. ర్యాలీ ముగిసిన అనంతరం పార్టీ యువనేత కె.రాహుల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్‌తో కలిసి కె. లక్ష్మణ్‌తో పాటు పాల్గొన్న వారందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా పోరాడుతామని, యువతలో అవగాహన కల్పిస్తూ నశాముక్త్ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ భారతదేశంతో అభివృద్ధిలో పోటీపడలేక కొన్ని శత్రు దేశాలు మన యువత నైపుణ్యాన్ని దెబ్బతీసేందుకు డ్రగ్స్ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ల మార్గదర్శనంలో నార్కోటిక్స్ డ్రగ్స్ సంస్థలు, సీబీఐ, ఈడీలతో పాటు తెలంగాణలో ఖిఈగల్‌ఖి ఫోర్స్ వంటి ప్రత్యేక సంస్థలు మాదకద్రవ్యాల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పూస రాజు, రత్న సాయిచంద్, విఎస్టి రాజు, ఎస్. శ్రీనివాస్ యాదవ్, ఎం రమేష్ రామ్, బి.రాంరెడ్డి, నవీన్ గౌడ్, టి.నవీన్ ముదిరాజ్ వందలాది మంది బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖజానాకు యేటా రూ.1,500 కోట్లు ఆదా

స్వల్పకాలిక రుణాలు దీర్ఘకాలికంగా మార్పు
రుణ మార్పిడి ప్రక్రియ కొనసాగింపు
తక్కువ వడ్డీ, స్వల్ప మొత్తాలతో ఇఎంఐలు
పాత రుణాలపై సర్కార్ వ్యూహాత్మకం
2026-27లో రూ.25 వేల కోట్ల రుణాల మార్పిడి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర ఖజానాపై రుణ భారం వత్తిడి పెరిగింది. గత ప్రభుత్వం హయంలో తీసుకున్న అప్పులతో పాటు, ప్రస్తుత సర్కార్ చేస్తున్న రుణాలతో ఖజానాపై తీవ్ర భారం పడుతోంది. దీంతో ఈ పెరుగుతున్న రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ అనుమతితో ప్రభుత్వం రుణాల మార్పిడి ప్రక్రియను కొనసాగిస్తోంది. తద్వారా రాష్ట్ర ఖజానాకు ఏటా సుమారు రూ.1,500 కోట్లు ఆదా చేయనుంది. రాష్ట్ర రుణ భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర సర్కార్ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు 2025లో రూ. 26 వేల కోట్ల విలువైన అధిక వడ్డీ రుణాలను గణనీయంగా తగ్గించిన పునర్వ్యవస్థీకరించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆమోదం తెలిపింది. ఫలితంగా పాత స్వల్పకాలిక అప్పులను స్వల్ప వడ్డీకి, ఎక్కువ వాయిదాలు, తక్కువ ఇఎమ్ఐలు (వాయిదా సొమ్ము) చెల్లించేలా దీర్ఘ కాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను కొనసాగిస్తోంది. వీటి స్థానంలో 13 నుండి 28 సంవత్సరాల వరకు తిరిగి చెల్లించే కాలపరిమితి గల తక్కువ వ్యయంతో కూడిన, దీర్ఘకాలిక బాండ్లను ప్రవేశపెడుతున్నారు. తద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో తక్షణ నగదు రుణాల వసూళ్ల ఒత్తిళ్లను తగ్గించనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ గత 2025-26లో రూ.26,103 కోట్ల విలువైన అప్పుల పునర్ వ్యవస్థీకరణలో పురోగతి సాధించి, వడ్డీ భారం తగ్గడానికి దోహదపడింది. తాజాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.25 వేల కోట్ల రుణాలను మార్చుకోవడానికి ప్రభుత్వం అనుమతి కోరిందని ఆర్థిక శాఖ అధికారిక వర్గాలు వెల్లడించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పాత రుణాలపై 11 శాతం వరకు వడ్డీ రేట్లు ఉండగా, పునర్వ్యవస్థీకరించుకున్న రుణాలను 7 నుంచి 7.5 శాతం మధ్య వడ్డీ రేట్లకు పొందుతోంది. ఈ విధంగా వడ్డీలో 3 నుంచి 3.5 శాతం పాయింట్ల తగ్గింపు వల్ల రుణ సేవల్లో ఏటా సుమారు రూ.1,000 కోట్ల ఆదా అవుతుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాబోయే రెండు నెలలైన మే, జూన్‌లలో మరో రూ.12 వేల కోట్ల మేర రుణాలను సేకరించాలని యోచిస్తోంది. ఈ సేకరించే రుణాలను పాత రుణాలను దీర్ఘకాలిక అప్పులుగా మార్పిడికి వినియోగించనున్నారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చేసిన విజ్ఞప్తుల మేరకు, ఈ పునర్వ్యవస్థీకరణ కింద ఇప్పటికే రాష్ట్ర రుణ సేవా భారాన్ని తగ్గించడంలో సహాయపడటంతో పాటు, ఎంతో అవసరమైన ఆర్థిక ఉపశమనాన్ని కూడా కేంద్రం అందించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రి వెల్లడిస్తూ దాదాపు రూ.2 లక్షల కోట్ల రుణాలను దశలవారీగా పునర్ వ్యవస్థీకరించి, మరింత మద్దతు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వద్ద సుమారు 2.74 లక్షల కోట్ల మొత్తం బకాయి రుణం ఉందని కేంద్రానికి నివేదించారు. రుణాల మార్పిడి వ్యూహం కింద, కాళేశ్వరం ప్రాజెక్ట్ వంటి ప్రత్యేక ప్రయోజనాలకు తీసుకున్న రుణాలు, వివిధ కార్పొరేట్ రుణాలతో సహా అధిక వ్యయంతో కూడిన రుణాలను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది.

## పారా అథ్లెట్ల విజయాలు దేశానికి గర్వకారణం

### గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఆసియా పారా గేమ్స్-2026లో భారత్ 114 పతకాలు సాధించడం పట్ల తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన దీప్తి జీవాంజి మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో స్వర్ణ పతకం, బానోతు అకీరా పురుషుల 400 మీటర్ల టీ38 విభాగంలో రజత పతకం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నర్ తన సోషల్ మీడియా ఖాతాల్లో అభినందనలు తెలుపుతూ పోస్ట్ చేశారు. శారీరక సవాళ్లు, ఎన్నో ప్రతి బంధకాలను అధిగమించి క్రీడాకారులు ఆసియా పారా గేమ్స్-2026లో రికార్డ్ స్థాయిలో పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేశారని గవర్నర్ కొనియాడారు. వారి పట్టుదల, అంకితభావం యువతకు స్ఫూర్తిదాయకమని, క్రీడారంగంలో మరింత మంది ప్రతిభావంతులు రాణించేందుకు వారి విజయాలు ప్రేరణగా నిలుస్తాయని గవర్నర్ తెలిపారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు.

## ప్రవాస భారతీయులే నిజమైన సాంస్కృతిక రాయబారులు

### రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 25, ప్రభాతవార్త :** పుట్టిన నేల నుండి వేల కిలోమీర్ల దూరంలోని విదేశాల్లో నివసిస్తూ భారతీయ, రాష్ట్రీయ సాంస్కృతిక, సంప్రదాయాలను విశేషంగా ప్రోత్సహిస్తూ విశ్వవ్యాప్తి చేస్తున్న ప్రవాస భారతీయులే నిజమైన సాంస్కృతిక రాయబారులు అని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మన సంస్కృతి, కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీకైన బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించిన స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్‌కు, పాల్గొన్న తెలుగు కుటుంబాలకు మంత్రి జూపల్లి శుభాభినందనలు తెలిపారు.




బతుకమ్మ-దసరా వేడుకల సభలో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బెర్న్ నగరంలో నేత్రపర్వంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బతుకమ్మ- దసరా వేడుకలు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కృష్ణారావు ప్రసంగిస్తూ ఇరు దేశాలు సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్, ఆతిథ్య రంగాలలో పరస్పర సహకారంతో అబివృద్ధి చెందే విధంగా మీరంతా కృషిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్విస్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను పెట్టుబడులు, పరిశ్రమలు, నూతన ఆవిష్కరణలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని మంతి కృష్ణారావు తెలిపారు. లైఫ్ సైన్సెస్, కృత్రిమ మేథస్సు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో స్విట్జర్లాండ్‌తో భాగస్వామ్యానికి మంచి అవకాశాలున్నాయని తెలిపారు. ముందుగా సభకు స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు వేదాంతం కిరణ్, కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి బావిగడ్డ బ్రహ్మానందరెడ్డి లతో పాటు గురుదయాళ్, అభినాష్, నగేష్, రాజుల పర్యవేక్షణలో తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మలతో ఆడుతూపాటుడూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఘనస్వాగతం పలికి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు.

## సంక్షేమ గురుకుల దుస్తులపై ప్రత్యేక దృష్టి

### నవంబరులోగా అందించాలనే లక్ష్యం
### ఎస్సీ గురుకుల సొసైటీ ప్రాజెక్టు ఛైర్మన్ రవి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణలోని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన దుస్తుల పంపిణీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ రకాల యూనిఫాంలు, క్రీడా దుస్తులు విద్యార్థులకు అందించడంలో ఎదురవుతున్న జాప్యాన్ని తగ్గించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కార్యాచరణను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా నైట్ డ్రెస్‌లు, ట్రాక్ సూట్లు, పీటీ దుస్తులను నవంబరులోగా విద్యార్థులకు అందించాలని నిర్ణయించారు. ఎస్సీ గురుకుల సొసైటీ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ ఛైర్మన్ రవి నాయక్ ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం విద్యార్థులకు సరఫరా చేయనున్న దుస్తుల డిజైన్లు, నమూనాల పరిశీలన ఇప్పటికే పూర్తయింది. వాటికి ఆమోదం లభించడంతో తదుపరి ప్రక్రియపై అధికారులు దృష్టి పెట్టారు. విద్యార్థులకు రెండో జత యూనిఫాంలు అందించేందుకు అవసరమైన వస్త్రాలను సమకూర్చడంతో పాటు, కుట్టు పనులకు పంపించారు. దీంతో ఈ దుస్తుల పంపిణీ త్వరలోనే ప్రారంభం కానుంది. మరో వారం రోజుల్లోగా విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రవి నాయక్ తెలిపారు.

ఇక వైట్ యూనిఫాంల సరఫరాకు సంబంధించి వర్క్ ఆర్డర్ల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. అవసరమైన అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని కూడా విద్యార్థులకు అందించనున్నారు. గురుకులాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా దుస్తులను సమకూర్చడంతో పాటు, భవిష్యత్తులో అదనపు అవసరాలు ఏర్పడినా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. సాధారణ అవసరాల కంటే 10 శాతం ఎక్కువ దుస్తులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. విద్యార్థుల సంఖ్యలో మార్పులు వచ్చినా ఈ నిల్వలు ఉపయోగపడనున్నాయి. విద్యార్థులకు అందించే దుస్తులు, ఇతర సామగ్రి నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించనున్నట్లు రవి నాయక్ స్పష్టం చేశారు. సరఫరా చేసిన వస్తువుల్లో నాణ్యతా లోపాలు బయటపడితే సంబంధిత గుత్తేదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులు నిర్ణీత సమయంలో అందేలా సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షి స్తున్నట్లు తెలిపారు.

## డిండి ప్రాజెక్టును రద్దు చేయాలనే అరుణ వ్యాఖ్యలు సరికాదు

### గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 0.5 టీఎంసీల నీటిని కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన పరిణామమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందడుగు పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుపై మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు సరికావని అభిప్రాయపడ్డారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని మాట్లాడటం సమంజసం కాదన్నారు. జాతీయ పార్టీలో కీలక నాయకురాలిగా, బీజేపీ ఎంపీగా ఉన్న ఆమె ప్రాంతాల మధ్య విభేదాలకు బదులుగా సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆదివారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. డిండి ఎత్తిపోతల పథకం కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని తెలిపారు. ఏ జిల్లా నీరు ఆ జిల్లాలోనే వినియోగించుకోవాలనే వాదన సరైనది కాదని, అదే విధానాన్ని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తే కర్ణాటక నుంచి తెలంగాణకు చుక్క నీరు కూడా రాదని వ్యాఖ్యానించారు. నీటి వినియోగంలో ప్రాంతీయ విభేదాలకు తావు లేకుండా సమగ్ర రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉండగా, 7.78 లక్షల ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఎస్ఎల్‌బీసీ, ఉదయసముద్రం, డిండి, దేవాదుల వంటి ప్రాజెక్టుల ద్వారా 7.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఆయా ప్రాజెక్టుల పనులు పూర్తి స్థాయిలో పూర్తి కాలేదని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో కృష్ణా బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు.

## రాష్ట్రంలో పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

### 15 డిగ్రీల కనిష్టం కంటే తక్కువ నమోదు
### క్రమేపీ పెరుగుతున్న చలితీవ్రత
### గ్రామీణ ప్రాంతాల్లో కురుస్తున్న మంచు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు క్రమేపీ పడిపోతున్నాయి. రాత్రి సమయాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. దీంతో తెలంగాణ వ్యాప్తంగా రాత్రి వేళల్లో చలి తీవ్రత క్రమంగా పుంజుకుంటోంది. ఏజెన్సీ ప్రాంతంలో అయితే చలి ప్రభావం అధికంగా ఉంటోంది. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 20 నుండి 15 డిగ్రీల వరకూ కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పలు మండలాలు, గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 నుంచి 17 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. తెలంగాణలోనే అతి తక్కువగా ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 14.8 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఇక గత కొన్ని రోజులుగా రాత్రి, తెల్లవారుజామున ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం నుంచే చల్లటి గాలులు వీస్తుండగా, అర్ధరాత్రి తర్వాత చలి మరింత తీవ్రంగా ఉంటోంది. ముఖ్యంగా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతుండటంతో అక్కడి ప్రజలు చలితో వణికిపోతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడంతో తెల్లవారుజామున పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో ప్రధాన రహదారులపై వాహనదారులు ఉదయం వేళల్లో హెడ్లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. కాగా రానున్న రెండు రోజుల పాటు ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయే అవకాశముందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయి చలి తీవ్రత అధికంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శివారు ప్రాంతాలతో పాటు, చెట్లు అధికంగా ఉండే గ్రీన్ జోన్లలో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత దాదాపు 15 డిగ్రీల సెల్సియస్‌కు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లోని ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

## ప్రజలు కొట్టుకునే పరిస్థితి తేవద్దు

### డిండి లిఫ్ట్ రద్దు చేయాల్సిందే
### సుఖేందర్‌రెడ్డికి ఎంపి డికె అరుణ కౌంటర్

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబరు 25 ప్రభాతవార్త:** శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పదేపదే డిండి పై మాట్లాడుతూ పాలమూరు రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలని, గుత్తా సుఖేందర్ రెడ్డి, తన పై చేసిన వ్యాఖ్యలను ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నల్గొండ జిల్లా నీటి సమస్య పరిష్కారానికి నక్కలగండి, నాగార్జున సాగర్, ఎస్ఎల్బీసీ (ఎస్ఎల్‌బిసి), మల్లన్న సాగర్ వంటి అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, అక్కడి నుంచి నీరు తీసుకోవాలే తప్ప, ఫ్లోరైడ్ సమస్య పేరుతో ఇక్కడ రాజకీయాలు చేయవద్దన్నారు. డిండి ప్రాజెక్ట్ ద్వారా 0.6 టీఎంసీల నీటిని తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది ముమ్మాటికి ఈ ప్రాంత రైతుల నోట్లో మట్టి కొట్టడమేనని డీకే అరుణ మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టు అసలు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టే కాదని, గతంలో జూరాల బదులు శ్రీశైలం బ్యాక్ వాటర్‌కు నీటి అప్రోచ్ మార్చినప్పుడే ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యం దెబ్బతిన్నదని విమర్శించారు. 72 జీవోలో డిండి ద్వారా నీళ్ల తరలించడం ఎక్కడా లేదని గుర్తుచేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును మొదటి డీపీఆర్ (డిపిఆర్) ప్రకారం రివ్యూ చేసి వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమిషన్లపై ఉన్న ధ్యాస, ప్రాజెక్టులను పూర్తి చేయడంపై లేదని డీకే అరుణ ఆరోపించారు. సమావేశంలో నాయకులు వీర బ్రాహ్మాచారి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు కిరణ్ కుమార్ రెడ్డి, మర్రి జ్యోతి, పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డుకు 6.5 ఎకరాలు ఆర్టీసీ స్థలం

### రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో అత్యంత విలువైన ముషీరాబాద్ డిపో పరిధిలోని 6.5 ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీని విలువ దాదాపు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా. దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వెనుక ఉన్న ముషీరాబాద్ డిపోకు చెందిన సుమారు 6.5 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాల నిమిత్తం తెలంగాణ హౌసింగ్ బోర్డుకు బదలాయించింది. ఈ విధంగా కేటాయించిన మొత్తం భూమి లో 25 గుంటల స్థలాన్ని వాణిజ్య అవసరాల కోసం ప్రత్యేకంగా కేటాయింపు చేస్తోంది. హైదరాబాద్ కలెక్టర్, సీసీఎల్‌ఏ ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా ఆర్టీసీ మనుగడకు కీలకమైన స్థలాలను ఇతర అవసరాలకు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ భూమికి బదులుగా గాజులరామారంలో ఆర్టీసీకి ప్రత్యామ్నాయంగా సుమారు 80 ఎకరాల భూమిని కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కీలకమైన హైదరాబాద్ నగరంలోని నడిబొడ్డున ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద గల వ్యూహాత్మక ప్రాంతంలో ఉన్న సంస్థ భూములను ఇలా బదలాయించడం సరికాదని ఆ సంస్థ కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్టీసీకి భవిష్యత్తు అవసరాలకు అంటే డిపోలు, వర్క్‌షాప్‌లు, ఉద్యోగుల సౌకర్యాలకు సంబంధించి ఉపయోగపడే అత్యంత విలువైన స్థలాన్ని దారాదత్తం చేయడంతో సంస్థకు నష్టం చేకూరుస్తుందని ఆర్టీసీ కార్మికులు, సంఘాల జేఏసీ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డున ఆర్టీసీకి ఉన్న అత్యంత ఖరీదైన ఆస్తులపై ప్రభుత్వం కన్నేసింది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలోని ముషీరాబాద్ డిపో పరిధిలో ఉన్న సుమారు రూ. వెయ్యి కోట్ల విలువైన 6.5 ఎకరాల స్థలాన్ని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ పేరిట ఈ నెల 22న జీవో నంబర్ 206 జారీ అయింది.

# ఆర్థిక వ్యవస్థలు టార్గెట్‌గా సైబర్ దాడులు

## భారతీయ బ్యాంక్‌లను నయా ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవాలి

## క్రెడిట్, డెబిట్ కార్డులు సామాన్యులకు సైతం అందుబాటులోకి

## భువనేశ్వర్‌లో రిజర్వ్‌బ్యాంక్ డేటా సెంటర్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ



**భువనేశ్వర్, అక్టోబరు 25:** ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణసంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశ వ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం అంతే ముఖ్యమని నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నాయ న్నారు. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేమని ప్రధాని పేర్కొన్నారు. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుందని ప్రధాని అన్నారు. దేశ బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం ప్రపంచంలోనే సమర్థంగా పనిచేస్తున్న వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని ప్రధాని పేర్కొన్నారు. ప్రజలకు రోజులో 24 గంటలూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చిన్న వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులకు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. గతంలో బ్యాంకింగ్ సేవలు కొద్దిమంది సంపన్నులు, పలుకుబడి ఉన్నవారికే ఎక్కువగా పరిమితమయ్యాయని మోడీ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ధనికులకు రుణాలు సులభంగా లభించేవని, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలకు తగిన అవకాశాలు దక్కలేదని ఆరోపించారు. 2014 తర్వాత సమతుల్య విధానాన్ని అనుసరించడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో డెబిట్, క్రెడిట్ కార్డులు సామాన్యులకు అందని విలాస వస్తువులుగా ఉండేవని, ప్రస్తుతం అవి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గత పదేళ్లలో బ్యాంకింగ్ సేవలు అందని వర్గాలకు వాటిని చేరువ చేయడంపై దృష్టి సారించామని మోడీ చెప్పారు. ఇక రానున్న దశాబ్దంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటమే కాకుండా, వాటిని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా చూడాలని అభిప్రాయపడ్డారు. డిజిటల్ లావాదేవీల భద్రత, వేగవంతమైన సేవలు, ఆర్థిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం భవిష్యత్తులో కీలకమని ఆయన వ్యాఖ్యానించారు.

భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించిన ప్రధాని డిజిటల్ బ్యాంకింగ్ సేవల భద్రతను బలోపేతం చేయడం, సైబర్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని మోడీ అన్నారు. కొత్త సదుపాయాలు ఈ దిశగా ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఒడిశా అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. గనుల రంగం నుంచి మైక్రోచిప్‌ల తయారీ వరకు పలు రంగాల్లో రాష్ట్రం భవిష్యత్తును నిర్మించుకోగలదని అన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించే అనేక మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.



ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య

# తాత్కాలిక ఉద్యోగులు, టీచర్లను వెంటనే పర్మినెంట్ చేయాలి

## బిసి భవన్‌లో రాష్ట్ర తాత్కాలిక ఉద్యోగుల సంఘం సమావేశం

## సిఎం రేవంత్ రెడ్డి వెంటనే చొరవ చూపాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ అక్టోబరు 25 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న తాత్కాలిక ఉద్యోగులను, బిసి, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న 8,000 మంది తాత్కాలిక ఉపాధ్యాయులను వెంటనే పర్మినెంట్ చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బిసి భవన్‌లో జరిగిన రాష్ట్ర తాత్కాలిక ఉద్యోగుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 10 నుండి 20 సంవత్సరాలుగా సుదీర్ఘ సేవలు అందిస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన పలు కీలక తీర్పులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. దేశంలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో లక్షలాది మంది తాత్కాలిక ఉద్యోగులను అక్కడి ప్రభుత్వాలు ఇప్పటికే పర్మినెంట్ చేశాయని కృష్ణయ్య పేర్కొన్నారు. మన రాష్ట్రంలో గతంలో కొంతమంది కాంట్రాక్ట్, డైలీవేజ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసినప్పటికీ, నేటికీ వేలాది మంది అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్, గెస్ట్ టీచర్లు, లెక్చరర్లు తీవ్ర అన్యాయానికి, శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్లు గడుస్తున్నా వేతనాలు పెరగకపోవడంతో కుటుంబ పోషణ, ఇంటి అద్దెలు, పిల్లల చదువుల ఫీజులు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో రోజురోజుకూ తాత్కాలిక ఉద్యోగుల ఆందోళనలు, ఉద్యమాలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చొరవ తీసుకోవాలని, ఒక స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకుని ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ తాత్కాలిక ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు, గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'అర్నబ్' ముప్పు

- ఎపిలో మరింత బలపడిన తీవ్ర వాయుగుండం
- కాకినాడ-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 140 కి.మీ వేగంతో గాలులు వీచే సూచనలు
- భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే చాన్స్
- ఉభయ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక
- వాతావరణ శాఖ హైఅలర్ట్ జారీ



**అమరావతి, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి పెను ముప్పులా మారుతోంది. ఇది రాబోయే సమయంలో 'అర్నబ్' అతి తీవ్ర తుఫాన్‌గా మారనుందని వాతావరణశాఖ (ఐఎండి) హెచ్చరించింది. ఇది ప్రస్తుతం విశాఖకు 880 కిలో మీటర్లు, కాకినాడకు 980 కిలోమీటర్లు, మచిలీ పట్నానికి 1080 కిలోమీటర్లు, బాపట్లకు 1150 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమైంది. గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో ముందుకు కదులుతోందని వాతావరణశాఖ పేర్కొంది. తీవ్ర వాయుగుండం సోమవారానికి తుపానుగా బలపడుతుందని వెల్లడించింది. ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరంచెంది అదే రోజు మధ్యాహ్ననికి బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ హైఅలర్ట్ ప్రకటించారు. విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అంచనా ప్రకారం, ఈ తుఫాన్ కాకినాడ - నర్సాపురం మధ్య కోనసీమ ప్రాంతం గుండా తీరం దాటేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయి. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు దాదాపు 140 కిలో మీటర్ల గరిష్ట వేగంతో ప్రచండ గాలులు విరుచుకుపడే అవకాశం ఉందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది. ఈ తుఫాన్ తీవ్రత కారణంగా కోస్తాంధ్ర వ్యాప్తంగా కుంభవర్షాలు కురిసే ప్రమాదముంది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 20 సెంట మీటర్లకు పైగా భారీనుంచి అత్యంత భారీవర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) ముప్పు కూడా పొంచి ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**జిల్లాల వారీగా హైఅలర్ట్: రెడ్, ఆరెంజ్ జోన్లు**

వాతావరణ పరిస్థితుల తీవ్రతను బట్టి అధికారులు జిల్లాలను అప్రమత్తం చేశారు. ఈనెల 27న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా తుఫాన్ తీరం దాటే కీలక సమయంలో అనకాపల్లి, విశాఖపట్నం, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు 'రెడ్ అలెర్ట్' కొనసాగుతుందని తెలిపారు. మరోవైపు ఉత్తరాంధ్రలోని మిగిలిన ప్రాంతాలు, దక్షిణ కోస్తా జిల్లాలను 'ఆరెంజ్ అలెర్ట్' జోన్ పరిధి లో ఉంచారు. ఈనెల 28న విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ , తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. వైఎస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆయా చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. తద్వారా 20 సెంటిమీటర్లకు మించి వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా అతి భారీ వర్షాల వల్ల 20 సెంటిమీటర్లలోపు వర్షపాతం, భారీ వర్షాలు 5 సెంటిమీటర్ల నుంచి 12 సెంటిమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. పెను తుఫాన్ ముప్పు మునుముందుకు వస్తున్న తరుణంలో ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధమైంది. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లరాదని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, అధికారిక సూచనలను విధిగా పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## బి అలర్ట్!

### జిల్లా కలెక్టర్లతో ఎపి సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** 'అర్నబ్' తుఫాను నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తత, అత్యున్నత సన్నద్ధత, ముందస్తు ప్రణాళికతో అన్ని స్థాయిల్లో యంత్రాంగం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫానుప్రభావం తీవ్రంగా ఉంటుందన్న వాతావరణశాఖ సమాచారం నేపథ్యంలో అన్నిశాఖలు సమన్వయంతో వ్యవహరించాలి, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి అని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవసరమైన సూచనలు చేయాలని ఆదేశించారు.



గ్లోబల్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సులో పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నారాపరాజు రాంచందర్‌రావు

# బ్రాహ్మణ పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** రాబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో గ్లోబల్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టభద్రుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం బర్కత్‌పురలోని తులసీవనంలో జరగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నారాపరాజు రాంచందర్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల పాత్ర అత్యంత కీలకమని, సమర్థులైన, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగిన మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. మండలాలు, జిల్లాల వారీగా పట్టభద్రులందరూ పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి ఓటరు నమోదుతో పాటు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. అలాగే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ మాట్లాడుతూ, పట్టభద్రుల్లో ఎన్నికల అవగాహన పెంపొందించడం, ఓటరు నమోదును ప్రోత్సహించడం, విద్యావంతులను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేయడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వేదాంతి పాండే, చింతపల్లి మంగపత్రావు, పూండ్ల కల్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్‌ఆర్‌పై త్వరలో ఎఐ నిఘా కెమెరాలు

## ట్రాఫిక్, వ్యర్థాల నియంత్రణే లక్ష్యంగా ఏర్పాట్లు

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** తెలంగాణలో హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్), సర్వీసు రోడ్ల వెంట తరచూ చెత్తను పారేస్తూ ఉంటారు. దీనిని అరికట్టేందుకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఒక ప్రణాళికను రూపొందించింది. నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా అక్రమంగా వ్యర్థాలను పారబోసే వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించి, వాటి లైసెన్స్ ప్లేట్ నంబర్లను నమోదు చేస్తుంది. అలా చెత్త వేసిన వారికి భారీ జరిమానాలు విధించనున్నారు. అంతేకాకుండా ఓ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంది. దీనిద్వారా వ్యర్థాలను వేస్తున్న వాహనాలపై తక్షణ చర్యలు తీసుకొనే వీలుంటుంది. ప్రస్తుతం అండర్ పాస్‌ల సమీపంలో జనసంచారం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాలలో రాత్రిపూట లారీలు, ట్రక్కులతో వచ్చి తరచూ వ్యర్థాలను పారేస్తున్నారు. గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, పెద్దఅంబర్‌పేట్, బాటసింగారం, పటాన్‌చెరు.శంకర్‌పల్లి, అలాగే మేడ్చల్, షమీర్‌పేట్ మార్గాలలో ఈ సమస్య అధికంగా ఉంది. ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్‌ను నిర్వహించడానికి సైబరాబాద్ పోలీసులు, హెచ్‌ఎండీఏ సహకారంతో ఏఐ ఆధారిత మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్‌ను ప్రవేశపెడుతు న్నారు. తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగే 14 ప్రాంతాలను కవర్ చేస్తూ, శంషాబాద్ నుంచి మేడ్చల్ వరకు 70 కిలోమీటర్ల మేర ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉల్లంఘనలను గుర్తించి, పరిష్కరించగల సామర్థ్యం ఈ కెమెరాల ముఖ్య లక్షణం. రియల్ టైంలో ఈ-చలాన్లను జారీ చేయడాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఈ వ్యవస్థను బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు సైబరాబాద్ కమిషనరేట్‌తో అనుసంధానించారు. ఓ ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా నాలుగు కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి కెమెరా 16రకాల సంఘటనలు లేదా ఉల్లంఘనలను గుర్తించగల సామర్థ్యాన్ని కలిగిఉంటుంది. అక్రమ వ్యర్థాల డంపింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలలో, సర్వీస్ రోడ్ల వెంట అలాగే ఇతర వ్యూహాత్మక ప్రదేశాల లో ఇలాంటి కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

## విద్యుత్ సరఫరాపై క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేశ్

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా సాగు విధానాల్లో మార్పులు చేసుకుంటూ, తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో అధిక ఆదాయం పొందే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం వలన వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాగు పద్ధతులను పరిశీలించాలని, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.

ఈ నేపథ్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని రాయికల్, విట్యాల, రామేశ్వరం గ్రామాల్లో సీఎండీ జితేశ్,, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి. శివాజీతో కలిసి ఆకస్మిక క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా (ఏజీఎల్) పరిస్థితులను, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును పరిశీలించి, రైతులకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. వరి సాగుకు అధిక నీరు అవసరమయ్యే నేపథ్యంలో, రైతులు తమ భూమి విస్తీర్ణం, నీటి లభ్యత, పెట్టుబడి సామర్థ్యాన్ని బట్టి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని సీఎండీ సూచించారు. ఒకటి, రెండు గుంటల చిన్న విస్తీర్ణం నుంచి ఎకరం, రెండు ఎకరాల భూమిలోనూ ఆకుకూరలు, మునగ, కూరగాయలు, పూల తోటలు వంటి పంటలను సాగు చేసే అవకాశాలను అన్వేషించాలని తెలిపారు.

పంటల సాగుతో పాటు పాడి పరిశ్రమ, చేపల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాల ద్వారా అదనపు ఆదాయం పొందే మార్గాలను కూడా రైతులు పరిశీలించాలని సూచించారు. నీరు, పెట్టుబడి, శ్రమను సమర్థంగా వినియోగించుకుంటూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకునే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు.

షాద్‌నగర్ ప్రాంతంలో పనిచేస్తున్న ఖేతీ సంస్థ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ బి) బృందంతో సీఎండీ చర్చించారు. తక్కువ భూమిలో, తక్కువ నీటితో, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ వివిధ పంటలు, కూరగాయలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుతో పాటు పాడి పరిశ్రమ వంటి అనుబంధ రంగాలను కూడా పరిశీలించడం ద్వారా ఆదాయ వనరులను విస్తరించుకోవచ్చని తెలిపారు.

# మా ర్యాలీకి బిజెపి విస్తృత ప్రచారం

## సోషల్ మీడియాలో రాహుల్ సెటైర్లు



**న్యూఢిల్లీ,అక్టోబరు 25:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండ్తో ఇండియా కూటమి నవంబర్ 1న రామ్లీలా మైదానం వరకు ర్యాలీ నిర్వహించతలపెట్టింది. ఈ ర్యాలీపై అధికార కూటమి నేతలు విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ ర్యాలీకి ప్రతిపక్ష కూటమి నేతలకంటే ఎక్కువగా బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలే ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమ ర్యాలీకి ఇంత ఉత్సాహంతో పెద్దఎత్తున పబ్లిసిటీ చేస్తున్నందుకు, ప్రోత్సహిస్తున్నందుకు బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీల నేతలకు కృతజ్ఞతలు రాహుల్గాంధీ తెలిపారు. రాబోయే 7 రోజులు కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని వ్యంగ్యంగా అన్నారు. మరోవైపు నవంబర్ 1న నిర్వహించ తలపెట్టిన నిరసన ర్యాలీలో పాల్గొనాలని విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వ్యాపారులకు పిలుపునిచ్చారు. దేశ ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారని, ఈ అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, మౌనంగా ఉండబోమని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించి, నియమ నిబంధనలను ఉల్లంఘించారని విమర్శించారు. ప్రశ్నలు అడిగిన వారిపై లాఠీలు ప్రయోగించారని, వాటన్నిటికీ ఇప్పుడు దేశం ప్రతిస్పందిస్తోందని అన్నారు. అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ముందుకు రావాలని, ఓటు మీదే పోరాటం కూడా మీదేనని సోషల్ మీడియా ద్వారా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నిర్వహించ నున్న ర్యాలీలో అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆదేశాలు జారీచేశారు. ఈనెల 30 నుంచి నవంబర్ 1 వరకు మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు సూచించారు. నవంబర్ 1న దేశరాజధానిలో నిర్వహించనున్న ర్యాలీలో దాదాపు 10 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ఉండేందుకు కేంద్రం ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

## బిజెపి జాతీయ సమావేశంలో పిలుపు

### జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం

### హాజరైన హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** బిజెపి అధిష్టానం పిలుపు మేరకు న్యూఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ అధ్యక్షతన, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో దేశవ్యాప్త ప్రముఖులతో కూడిన ఉన్నత స్థాయి విస్తృత సమావేశం ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్చార్జ్ ఎన్.వి.సుభాష్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ కీలక భేటీలో వివిధ రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాజ్యసభ సభ్యులు తరుణ్ చుగ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సల్, ఆంధ్రప్రదేశ్ నుంచి దగ్గుబాటి పురందేశ్వరి, దేశవ్యాప్తంగా విచ్చేసిన మేధావులు, నేషనలిస్ట్ థింకర్స్, పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖ మీడియా ప్రతినిధులు భాగస్వామ్యమయ్యారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు, దాని ప్రాధాన్యతలపై క్షేత్రస్థాయి వరకు సమగ్ర అవగాహన కల్పించే దిశగా పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణాత్మక చర్యలపై కాంగ్రెస్ మరియు ఇతర విపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను, అసత్య ప్రచారాలను పూర్తి ఆధారాలతో ప్రజల్లో ఎండగట్టాలని నాయకత్వం పిలుపునిచ్చింది. ప్రజలకు వాస్తవాలను సులభతరంగా, సూటిగా వివరించేందుకు ప్రతి కార్యకర్త, ప్రజాప్రతినిధి, మీడియా ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# జపాన్‌లో మరోసారి భూకంపం

## రిక్టర్‌స్కేలుపై 6.3గా తీవ్రత నమోదు



**టోక్యో, అక్టోబరు 25:** జపాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. యూరోపియన్‌మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ ప్రకారం, జపాన్‌లోని బోనిన్ దీవుల ప్రాంతంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆస్తి, ప్రాణ నష్టాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు, దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని వనాటు దీవుల ప్రాంతంలోనూ ఇటీవల బలమైన భూకంపం నమోదైనట్లు సమాచారం. అక్కడ భూకంప తీవ్రత 7.1గా నమోదైనట్లు పేర్కొంటున్నారు. జపాన్ ప్రపంచంలో భూకంపాలు ఎక్కువగా సంభవించే దేశాల్లో ఒకటి. దీనికి ప్రధాన కారణం ఆ దేశం భౌగోళికంగా పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో ఉండటమే. ఈ ప్రాంతంలో అనేక టెక్టానిక్ ప్లేట్లు కలుస్తాయి. వాటి కదలికలు, పరస్పర ఘర్షణలు, ఒక ప్లేట్ మరొక ప్లేట్ కిందకు జారే ప్రక్రియల వల్ల భూకంపాలు సంభవిస్తుంటాయి. భూమి పైపొర అనేక పెద్ద, చిన్న టెక్టానిక్ ప్లేట్లతో ఏర్పడింది. ఈ ప్లేట్లు నిరంతరం కదులుతుంటాయి. కొన్ని ప్రాంతాల్లో అవి ఒకదానికొకటి ఢీకొంటాయి, మరికొన్ని చోట్ల పక్కపక్కన జారుతాయి. ప్లేట్ల మధ్య ఏర్పడిన ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు భూమి కంపిస్తుంది. ఈ ప్రక్రియనే భూకంపం అంటారు. పసిఫిక్ మహాసముద్రం చుట్టూ విస్తరించిన భూకంపాలు, అగ్నిపర్వత కార్యకలాపాలు అధికంగా ఉండే ప్రాంతాన్ని పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అని పిలుస్తారు.

# నీటి లభ్యత మేరకే రబీ సాగు చేయాలి: మంత్రి తుమ్మల

**అశ్వాపురం, ప్రభాతవార్త, అక్టోబరు 25:** ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులు మారుతున్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆయన ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద దుమ్ముగూడెం ఆనకట్ట పరిశీలన సందర్భంగా మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో తగ్గిన నీటి ప్రవాహాల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ముందస్తుగా అప్రమత్తమై నష్టాలను నివారించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రబీ సాగుపై రైతులు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాలు, విద్యుత్ లభ్యతను అంచనా వేసుకుని తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ఫ్రెంచ్ ఓపెన్‌లో సింధు ఓటమి



**పారిస్:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సూపర్ 750 టోర్నమెంట్ అయిన బీడబ్ల్యూఎఫ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో ఓటమిపాలైంది. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన ఆమె, దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ నంబర్ 1 ఆన్ సే యంగ్ చేతిలో ఓడిపోయింది. సింధు ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ చేతిలో 21-16, 11-21, 12-21 తేడాతో పరాజయ చెందింది. సింధు బలంగా ప్రారంభించి తొలి గేమ్‌ను 21-16 తేడాతో గెలుచుకుంది. కానీ రెండో, మూడో గేమ్‌లలో అన్ సే తన విజృంభణను ప్రదర్శించి సింధు పై తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అంతకు ముందు సింధు సెమీఫైనల్‌లో జపాన్‌కు చెందిన హినా అకేచిని 21-10, 20-22, 21-16 తేడాతో ఓడించి, తన తొలి ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోరుకు చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరిగిన తన ప్రచారంలో, ఆమె థాయ్‌లాండ్‌కు చెందిన సుపానిడా కటెథాంగ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన తొలిరౌండ్ పోరులో గెలిచి, ఆ తర్వాత జపాన్‌కు చెందిన రికో గుంజి, చైనీస్ తైపీకి చెందిన చియు పిన్‌చియాన్‌లను వరుస గేమ్‌లలో ఓడించింది. 2026లో 651 అనే అద్భుతమైన గెలుపుఓటముల రికార్డుతో ఆన్ సే యంగ్ ఆదివారం నాటి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. ఫైనల్‌లో ఈ విజయంతో, ఆమె ప్రస్తుతం 50 మ్యాచ్‌ల విజయ పరంపరలో ఉంది. ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ మినహా, ఈ ఏడాది ఆమె ఆడిన అన్ని టైటిల్ పోరులలోనూ విజయం సాధించింది.

# నింగ్బో ఛాంపియన్‌గా రైబాకినా



**నింగ్బో:** ప్రపంచ నంబర్ 1 ఎలెనా రైబాకినా, ఆదివారం ఇక్కడి సెంటర్ కోర్టులో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో కెనడాకు చెందిన లేలా ఫెర్నాండెజ్‌ను ఓడించి తన నింగ్బో ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకుని ఛాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది తన నాలుగో టైటిల్ కోసం ఫెర్నాండెజ్‌ను 6-2, 6-2 తేడాతో ఓడించడానికి రైబాకినాకు 1 గంట 16 నిమిషాలు పట్టింది. ఈ మ్యాచ్‌లో ఆమె ప్రపంచ 30వ ర్యాంకర్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది, రెండు సెట్లలోనూ రెండేసి సార్లు బ్రేక్ సాధించి నింగ్బోలో వరుసగా రెండో టైటిల్‌ను గెలుచుకుంది. మొదటి సెట్ ప్రారంభంలో వరుస బ్రేక్ పాయింట్లను కాపాడుకోవలసి రావడంతో కజఖ్ క్రీడాకారిణికి కొంత సవాలు ఎదురైంది. అయినప్పటికీ, ఆమె అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఆ తర్వాత వరుసగా ఐదు గేమ్‌లను గెలుచుకుని మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో కూడా రైబాకినా మంచి ఫామ్‌లో ఉండి, తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణి రెండవ సెట్‌లో ఫెర్నాండెజ్ సర్వీస్‌ను రెండుసార్లు ఒకసారి మూడవ గేమ్‌లో, ఆపై ఏడవ గేమ్‌లో బ్రేక్ చేసి, ఆ తర్వాత మ్యాచ్‌ను సునాయాసంగా గెలుచుకుంది.

## అల్మటీ ఓపెన్‌లో భాంబ్రీ-ర్యాన్

# డబుల్స్ జోడీకి టైటిల్

**అల్మాటీ:** ఆదివారం జరిగిన ఉత్కంఠభరితమైన మూడు సెట్ల పోరులో టాప్ సీడెడ్ ఆస్ట్రియన్ జంట లూకాస్ మిడ్లర్-నీల్ ఓబర్‌లీట్నర్‌లను ఓడించి, భారత ఆటగాడు యూకీ భాంబ్రి-అమెరికన్ ర్యాన్ సెగర్‌మాన్ జోడీ ఏటీపీ 250 అల్మాటీ ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. భారత, అమెరికన్ ద్వయం అల్మాటీ అరీనాలో 7-6(3), 6-7(1), (10-2) తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. మొదటి సెట్ హోరాహోరీగా సాగింది, ఇరు జట్లు తమ సర్వీలను నమ్మకంగా నిలబెట్టుకున్నాయి. చివరకు ఆ సెట్ టైబ్రేక్‌లో నిర్ణయించబడింది, అందులో భాంబ్రి-సెగ్గర్‌మాన్ జంట 7-3 తేడాతో విజయం సాధించింది.

రెండో సెట్‌లో ఆస్ట్రియన్ జంట పుంజుకుని మ్యాచ్‌ను సమయం చేసింది. టైబ్రేక్‌లో 7-1తో ఆధిపత్యం చెలాయించి, నిర్ణయాత్మక మ్యాచ్‌కు దారితీసింది. మ్యాచ్ టైబ్రేక్ ప్రారంభ పాయింట్ల నుంచే భంబ్రి-సెగ్గర్‌మాన్ ఆధిపత్యం చెలాయించి, అద్భుతమైన ప్రదర్శనతో 10-2 తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ మ్యాచ్ ఒక గంట 26 నిముషాల పాటు సాగింది. ఈ పోరులో భారత్, అమెరికన్ జోడీ ఆరు ఏస్‌లు సాధించి, కేవలం ఒక డబుల్ ఫాల్ట్ మాత్రమే చేసింది. ఆస్ట్రియన్ ప్రత్యర్థులు మూడు ఏస్‌లు, ఒక డబుల్ ఫాల్ట్ నమోదు చేశారు.



ఆట




# మరోసారి భారత్, పాక్ పోరు

## నవంబరు 22న దాయది దేశాల ఢీ

**న్యూఢిల్లీ:** క్రికెట్ లోకంలో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. భారత్, పాకిస్తాన్ జట్లు మరోసారి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాయి. పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్, 2026 టోర్నమెంట్ షెడ్యూల్‌ను ఏషియన్ క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) అధికారికంగా విడుదల చేసింది. దౌహా వేదికగా జరగనున్న ఈ టోర్నీలో ఇండియా ఏ, పాకిస్తాన్ ఏ జట్లు ఒకే గ్రూపులో చోటు దక్కించుకున్నాయి. ఈ టోర్నీలో భారత్ తన మొదటి మ్యాచ్‌ను నవంబర్ 20న నేపాల్‌తో ఆడనుంది.

ఆ తర్వాత నవంబర్ 22న వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడనుంది. గ్రూప్ దశలో భారత్ తన చివరి మ్యాచ్‌ను నవంబర్ 24న యూఏఈతో ఆడనుంది. ఈ టోర్నీలో మొత్తం 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఏ లో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ ఉన్నాయి. అలాగే గ్రూప్ బీ లో ఇండియా, పాకిస్తాన్, నేపాల్, యూఏఈ స్థానం సంపాదించాయి. ప్రతీ జట్టు తన గ్రూపులోని మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. రెండు గ్రూపులు నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్ మ్యాచ్‌లు నవంబర్ 26, 27 తేదీల్లో జరగనున్నాయి.

గత 2025 ఎడిషన్‌లో ఇండియా జట్టుకు జితేష్ శర్మ నాయకత్వం వహించాడు. ఆ టోర్నీలో యూఏఈపై 148 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి భారత్ శుభారంభం చేసినప్పటికీ, పాకిస్తాన్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. అనంతరం ఒమన్ పై గెలిచి సెమీఫైనల్ చేరిన భారత్, సెమీస్‌లో బంగ్లాదేశ్ తో జరిగిన టై మ్యాచ్‌లో సూపర్ ఓవర్ ద్వారా ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు పాకిస్తాన్ సెమీస్‌లో శ్రీలంకపై గెలిచి, ఫైనల్లో బంగ్లాదేశ్‌ను సూపర్ ఓవర్లో ఓడించి విజేతగా నిలిచింది. ఈ సారి 2026 ఎడిషన్‌లో భారత్ పాత పరాజయాన్ని మర్చిపోయి కప్‌ను గెలవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

## ఫీఫా ప్రపంచ కప్‌లో కామెరూన్‌ను

# ఓడించిన భారత్

## రెండో మ్యాచ్‌లోనూ విజయం

**బాకు:** తొలి ఫీఫా అండర్15 ప్రపంచ కప్ ఫెస్టివల్ అజర్‌బైజాన్ 2026 లో భారత్ తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఆదివారం నాడు బాకులో జరిగిన తమ రెండవ గ్రూప్ మ్యాచ్‌లో కామెరూన్‌ను 2-1 తేడాతో ఓడించింది. ఇప్పటివరకు ఆడిన రెండు గ్రూప్ మ్యాచ్‌లలోనూ గెలిచిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది.

వర్షం కురుస్తున్నప్పటికీ, బ్లూ కోల్ట్స్ తమ ప్రభావాన్ని చూపారు. మొదటి నిమిషంలోనే దీపక్ సింగ్ అరాంబం కొట్టిన కార్నర్ కిక్ కామెరూన్ బాక్స్‌లో గందరగోళానికి కారణమైంది. కామెరూన్ క్రమంగా ఒత్తిడిని పెంచినప్పటికీ, భారత్ సరైన సమయంలో స్లైడింగ్ టాకిల్స్ చేస్తూ తమ ఆధిక్యాన్ని నిలుపుకుంది. 14వ నిమిషంలో బిబియానో ఫెర్నాండెజ్ బృందం తమ ఆధిక్యాన్ని దాదాపు రెట్టింపు చేసుకుంది. తర్వాత జెనిత్ వరుసగా కీలకమైన సేవ్‌లు చేసి భారత్‌ను ఆదుకున్నాడు. దీపక్ (19వ) కొట్టిన షాట్ సైడ్ నెట్టింగ్‌లోకి వెళ్లింది. అయితే, కామెరూన్ (20వ) స్కోరును సమం చేసింది. మోక్తార్ ఇచ్చిన క్రాస్ మహమ్మద్ సోహిల్ ఖాన్‌కు తగిలి నెట్‌లోకి వెళ్లడంతో ఓన్ గోల్ నమోదైంది. రెండవ అర్ధభాగంలో లాల్‌రెమ్‌రువాట్‌ఫెలా తొలి ప్రయత్నంలోనే భారతదేశానికి తిరిగి ఆధిక్యాన్ని అందించాడు. కామెరూన్‌కు (31వ) పెనాల్టీ లభించినా (32వ) హరూనా అబ్దులాయే కొట్టిన స్పాట్‌కిక్‌ను ఆపి, భారత్ ఆధిక్యాన్ని నిలబెట్టాడు. ఆట చివరి దశలలో బ్లూ కోల్ట్స్ తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. భారత్ తమ ఆటతీరును కాపాడుకుంటూ మ్యాచ్‌ను ముగించి వరుసగా రెండో విజయాన్ని కైవసం చేసుకుంది.




# వెండి ధరలు భారీగా పతనం

## కిలో రూ.4.2 లక్షల నుంచి రూ.1.9 లక్షలకు డౌన్



**ముంబయి, అక్టోబరు 25:** బంగారం, వెండి వంటి విలువైన లోహాల మెరుపు తగ్గుతోంది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరలు, మధ్యప్రాచ్యంలో మళ్లీ తీవ్రతరమవుతున్న ఘర్షణలు, అమెరికా వడ్డీ రేట్ల పెంపుపై నెలకొన్న అంచనాలు ఈ లోహాల ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయి. గత వారం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం స్పాట్ ధర ఔన్సుకు 3,989.10 నుంచి 3,993.96 డాలర్ల స్థాయికి పడిపోయింది. అనంతరం కొంత కోలుకుని 4,026 డాలర్లకు చేరినప్పటికీ, రోజులో జరిగిన నష్టాల్లో ఎక్కువ భాగాన్ని భర్తీ చేసుకున్నా ధరలపై ఒత్తిడి కొనసాగింది. మరోవైపు, వెండి ధరల పతనం మరింత తీవ్రంగా ఉంది. ఔన్సుకు 120 డాలర్ల స్థాయి నుంచి 53.8 డాలర్లకు పడిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ నష్టాలు నమోదయ్యాయి. ఈ పరిణామాల ప్రభావంతో భారతదేశంలో ఎంసిఎక్స్ మార్కెట్‌లో వెండి ధర కిలోకు సుమారు రూ.4.2 లక్షల స్థాయి నుంచి రూ.1.9 లక్షలకు దిగివచ్చింది. సురక్షిత పెట్టుబడులుగా భావించే ఆస్తులకు కొంత మద్దతునిచ్చినప్పటికీ, మార్కెట్లలో అనిశ్చితి పెరిగిన సమయాల్లో బులియన్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి అధికమైందని కోటక్ నియోకు చెందిన కమోడిటీ రీసెర్చ్ విభాగం ఎవిపి కైనత్ చైన్‌వాలా పేర్కొన్నారు. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే, వెండితో పోలిస్తే బంగారం మెరుగైన స్థితిలో ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వెండికి పారిశ్రామిక రంగం నుంచి గణనీయమైన డిమాండ్ ఉండటంతో, ఆర్థిక పరిస్థితులు మరింత ప్రతికూలంగా మారితే ధరలు లోతైన దిద్దుబాటుకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో వెండి ధర ఔన్సుకు 50 డాలర్ల దిగువకు పడిపోతే, దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1.9 లక్షల కంటే దిగువకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారుల దృష్టి ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశంపై ఉంది. వడ్డీ రేట్ల పెంపు ప్రక్రియకు విరామంలభిస్తే, బంగారం, వెండి ధరలపై ఉన్న కొంత ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. ఈ నెలలో బంగారం, వెండి రెండింటిపైనా నిరంతర అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోందని కమోడిటీ నిపుణులు పేర్కొంటున్నారు. అక్టోబర్‌లో అమెరికా వడ్డీ రేట్ల పెంపు జరిగే అవకాశం 10 శాతం కంటే తక్కువగా మార్కెట్లు అంచనా వేస్తున్నప్పటికీ, ముడి చమురు ధరలు పెరగడం మళ్లీ ద్రవ్యోల్బణ భయాలను పెంచుతోంది. దీంతో అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువ కాలం అధిక స్థాయిలోనే కొనసాగవచ్చనే అంచనాలు బలపడుతున్నాయి. ఈపరిణామాలు బంగారం, వెండి ధరలకు ప్రతికూలంగా మారవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో దాడులు చమురు సరఫరా సాధారణ స్థితికి చేరే అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న చమురు మార్కెట్‌లో ధరలు మరింత పెరిగే పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

# గడువు అనంతరం ఎఫ్‌డిలు తీసుకోకపోతే సమస్యే

**ముంబయి, అక్టోబరు 25:** ఫిక్స్‌డ్ డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత కూడా డబ్బులు తీసుకోకపోతే ఏం జరుగుతుందనే దానిపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ కొన్ని స్పష్టమైన నిబంధనలు రూపొందించింది. సాధారణంగా ఎఫ్‌డి కాల పరిమితి పూర్తి కాగానే ఖాతాదారుడికి డబ్బులు అందాలి. కానీ చాలాసార్లు సమాచారం లేకపోవడం వల్ల అలా జరగదు. ఎఫ్‌డి ఖాతా తెరిచే సమయంలోనే ఆటోరెన్యూవల్ ఆప్షన్ ఎంచుకుంటే, బ్యాంకు నిబంధనల ప్రకారం ఆ డిపాజిట్ మళ్లీ రెన్యూవల్ అవుతుంది. ఒకవేళ డబ్బులు నేరుగా ఖాతాలో జమ అయ్యేలా ఉంటే ఆ ప్రక్రియ జరుగుతుంది. గడువు తీరిన తర్వాత కూడా ఎఫ్‌డి డబ్బులు తీసుకోకపోతే, ఆ మొత్తంపై వడ్డీ విషయంలో కొన్ని మార్పులు ఉంటాయి. పాత ఎఫ్‌డికి ఇస్తున్న వడ్డీయే ఎప్పటికీ కొనసాగుతుందనిచెప్పలేం. సాధారణ సేవింగ్స్ ఖాతా వడ్డీ లేదా గడువు ముగిసిన ఎఫ్‌డిపై వర్తించే వడ్డీ రేట్లలో ఏది తక్కువగా ఉంటే ఆ మొత్తమే లభిస్తుంది. ఒకవేళ ఎఫ్‌డి మెచ్యూరిటీ తేదీ నుంచి పది సంవత్సరాల వరకు ఎలాంటి క్లెయిమ్ చేయకపోతే, ఆడబ్బును అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్‌గా పరిగణిస్తారు. పదేళ్లు పూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలోని డిఇఎ ఫండ్‌కు బ్యాంకులు బేలన్స్ చేసి బదిలీ చేస్తాయి. డిపాజిట్ చేసిన సొమ్ము ఎప్పటికైనా ఖాతాదారుడికే చెందుతుందని గమనించాలి. ఖాతాదారుడు లేదా చట్టపరమైన వారసులు ఎప్పుడైనా సంబంధిత బ్యాంకును సంప్రదించి, సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఆ డబ్బును తిరిగి పొందవచ్చు. ఒకవేళ ఖాతాదారుడు మరణిస్తే, నామినీ లేదా చట్టపరమైన వారసులు డెత్ సర్టిఫికెట్, గుర్తింపు పత్రాలు సమర్పించి క్లెయిమ్ చేసుకోవచ్చు. ఎఫ్‌డిని తిరిగి రెన్యూవల్ చేసే ముందు ప్రస్తుత వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి, డబ్బు ఎప్పుడు అవసరమవుతుంది అనే విషయాలను బేరీజు వేసుకోవడంమంచిది. భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా కుటుంబ సభ్యులకు ఎఫ్‌డి వివరాలు, నామినీ సమాచారం ఎప్పుడూ అందుబాటులో ఉంచడం చాలా ముఖ్యం.

# ఈవారం మార్కెట్లలో ఇన్వెస్టర్లకు జోష్




**ముంబయి, అక్టోబరు 25:** భారతీయ ఈక్విటీ మార్కెట్లలో పలు కంపెనీలు డివిడెండ్లు ప్రకటన స్టాక్ విభజనలు చేస్తున్నాయి. ఎల్ అండ్ టి టెక్నాలజీ, శ్రీరామ్ ఫైనాన్స్, క్రిసిల్ వంటి దిగ్గజ కంపెనీలతో సహా దాదాపు 24 సంస్థలు తమ కార్పొరేట్ చర్యల్లో భాగంగా ఎక్స్ రికార్డ్ తేదీకి సిద్ధమవుతున్నాయి. పలు కంపెనీలు తమ వాటాదారులకు అదనపు ఆదాయాన్ని అందించేందుకు మధ్యంతర డివిడెండ్లను ప్రకటిస్తుండగా మరికొన్ని సంస్థల షేర్ల విభజన లేదా బోనస్ షేర్ల కేటాయింపులను అమలు చేస్తున్నాయి. ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్న కంపెనీల్లో ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్ మొదటి వరుసలో ఉంది. ఒక్కో షేరుపై రూ.20 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి సంబంధించిన ఎక్స్ డేట్, రికార్డ్ తేదీగా ఈనెల 27ను నిర్ణయించింది. దీంతో పాటు అనంతమ్ హైవేస్ ట్రస్ట్ సైతం డివిడెండ్ ఎక్స్ రికార్డ్ తేదీ ఇదే రోజు ఉంది. హెక్సావేర్ టెక్నాలజీస్ కంపెనీ రూ.9.50 చొప్పున డివిడెండ్ చెల్లిస్తుండగా, రికార్డ్ తేదీగా ఈనెల 26ను నిర్ణయించింది. శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ నాన్ బ్యాకింగ్ ఫైనాన్షియల్ సెక్టార్ నుంచి డివిడెండ్ ఇస్తోంది.

ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.6.50 చొప్పున డివిడెండ్ చెల్లించనుంది. నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్మెంట్, సైయంట్ కంపెనీలు డివిడెండ్ చెల్లిస్తున్నాయి. నిప్పాన్ ఇండియా ఎఎంసి ఒక్కో షేరుకు రూ.9.50 చొప్పున ఇస్తుండగా సైయంట్ ఒక్కో షేరుకు రూ.12 ,రేటింగ్ సంస్థ క్రిసిల్ రూ.17 చొప్పున డివిడెండ్లు ప్రకటించాయి. ఇక చెన్నై పెట్రోలియం ఒక్కో షేరుపై రూ.25 చొప్పున డివిడెండ్ చెల్లిస్తోంది. కేసాల్వ్స్ ఇండియా రూ.1 చొప్పున డివిడెండ్ ఇస్తోంది. అడోర్ వెల్డింగ్ ఒక్కో షేరుకు రూ.7.50, స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ రూ.1.50 చొప్పున, అంవిల్ హెల్త్ కేర్ రూ.0.50 చొప్పున, హైపర్ టెక్నాలజీస్ రూ.0.25 చొప్పున, సగిలిటి రూ.0.15 చొప్పున, డిసిఎం శ్రీరామ్, రెయిల్ టెల్ కార్పొరేషన్లు ఎక్స్ డివిడెండ్ రికార్డ్ తేదీగా ఈనెల 30ని నిర్ణయించాయి. మిడాస్ ఫ్యాషన్స్ కంపెనీ 1:2 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపడుతోంది

ఇండియన్ ఎమల్సిఫయర్స్, మ్యాగ్నమ్ స్టీల్ అండ్ ఇన్‌ఫ్రా కంపెనీలు తమ రైట్స్ ఇష్యూకు రికార్డ్ తేదీగా ఈనెల 27ను నిర్ణయించాయి. అర్బన్ ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ తమ రైట్స్ ఇష్యూ 1:1 రేషియోలో అందించేందుకు రికార్డ్ తేదీని ఈనెల 28గా నిర్ణయించింది. చాందిని మెషీన్స్ కంపెనీ 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేస్తోంది. వీటితో పాటు గెలాక్సీ అగ్రికో ఎక్స్‌పోర్ట్స్, మీనాక్షి ఇండియాలు సైతం స్టాక్ స్ప్లిట్ చేస్తున్నాయి.

# భారత్ ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల భారీ విత్‌డ్రాలు

## ఈనెలలో ఇప్పటివరకు రూ.48,056 కోట్ల పెట్టుబడులు వెనక్కి



**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరులు భారీగా పెట్టుబడులు విత్‌డ్రా చేసారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అధికస్థాయిలో కొనసాగడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడం, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అక్టోబర్‌లో ఇప్పటివరకు భారత ఈక్విటీల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐలు) రూ.48,056 కోట్లను వెనక్కి తీసుకున్నారు. గత వారం విదేశీ మదుపరుల అమ్మకాల ఒత్తిడి గణనీయంగా తగ్గింది.

రెండు ట్రేడింగ్ రోజుల్లో వారు నికర కొనుగోలు దారులుగా మారడం కొంత ఊరటనిచ్చింది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో ఎఫ్‌పీ ఐలు రూ.35,861 కోట్ల పెట్టుబడులను ఉప సంహరించుకున్నారు. అంతకుముందు జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్ల పెట్టుబడులు పెట్టారు. తాజా ఉపసంహరణలతో 2026లో ఇప్పటివరకు భారత ఈక్విటీల నుంచి ఎఫ్‌పిఐలు వెనక్కి తీసుకున్న మొత్తం రూ.3.08 లక్షలకోట్లకు చేరింది. చాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ మాట్లాడుతూ, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు సుమారు 114 డాలర్లకు చేరడం, కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణ ఆందోళనలు, దేశీయ ద్రవ్య లభ్యతపై అనిశ్చితి వంటివి విదేశీ మదుపరుల అమ్మకాలకు కారణమని తెలిపారు.

జియో ప్లాట్‌ఫామ్స్ కుసంబంధించిన రూ.30,213 కోట్ల ఐపిఒ కూడా తాత్కాలికంగా మార్కెట్‌లోని నిధుల లభ్యతపై ప్రభావం చూపిందని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుల కేటాయింపుల్లో మార్పులు భారత ఈక్విటీలపై ఒత్తిడిని పెంచాయని వివరించారు. మీరామనీ సహ వ్యవస్థాపకుడు ఆనంద్ కే.రాఠీ మాట్లాడుతూ, ముడి చమురుధరలుఅధిక స్థాయిలో కొనసాగడం, కంపెనీల భవిష్యత్ ఆదాయాలపై ఆందోళనల కారణంగా విదేశీ మదుపరులు పెట్టు బడులను ఉపసంహరించుకుంటున్నారని పేర్కొ న్నారు. ఈ నెల 23తో ముగిసిన వారంలో ఎఫ్‌పి ఐలు తమ అమ్మకాలను గణనీయంగా తగ్గించ డంతో పాటు రెండు రోజులు నికర కొనుగోలు దారులుగా మారారు.



# కృత్రిమ మేధతో గ్లోబల్ ఎకానమీకి యేటా 2.52 ట్రిలియన్ డాలర్లు: మెకిన్సే

**ముంబయి, అక్టోబరు 25:** కృత్రిమ మేధ (ఎఐ) ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పనులను ఆటోమేషన్ చేయడం, ఉద్యోగులకు సహకరించడం ద్వారా యేటా 2.52 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక విలువను సృష్టించే అవకాశం ఉందని మెకిన్సే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. యేఐ సాంకేతికత అమలుకు అయ్యే ఖర్చులు పెరిగితే ఈ ప్రయోజనాలు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ది ఎఐ వాల్యూ కర్వ్,ది ఎకనామిక్స్ ఆఫ్ అప్లయింగ్ ఎఐ టు ఎగ్జిస్టింగ్ వర్క్ పేరుతో విడుదలైన ఈ నివేదికలో, ఎఐ స్వీకరణ పెరుగుతున్నప్పటికీ, దాని ద్వారా వాస్తవంగా ఎంత ఆర్థిక ప్రయోజనం లభిస్తోందనే విషయంలో అంతరం పెరుగుతోందని పేర్కొంది. అనేకసంస్థలు ఎఐసాంకేతికతను అమలు చేయడంపైనే దృష్టి సారిస్తున్నాయని, దాని ద్వారా లభించే ప్రయోజనాలను అంచనా వేయడంపై తగిన శ్రద్ధ చూపడం లేదని అధ్యయనం తెలిపింది. ఎఐ వినియోగానికి సంబంధించిన సమర్థవంతమైన మొత్తం ఖర్చులు 30 శాతం పెరిగితే, ప్రపంచవ్యాప్తంగా యేటా లభించగల ఆర్థిక ప్రయోజనాల్లో 850 బిలియన్ డాలర్ల మేర తగ్గుదల సంభవించవచ్చని మెకిన్సే అంచనా వేసింది.

దీంతో ఎఐ ద్వారా లభించే అవకాశం ఉన్న ఆర్థిక విలువ 2.52 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.67 ట్రిలియన్ డాలర్లకు పడిపోవచ్చని తెలిపింది. అమెరికా విషయానికి వస్తే యేటా లభించే ఆర్థిక విలువ 960 బిలియన్ డాలర్ల నుంచి 640 బిలియన్ డాలర్లకు తగ్గవచ్చని నివేదిక పేర్కొంది. 2030 నాటికి ఎఐ మౌలిక సదుపాయాలపై సుమారు 7 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని మెకిన్సే అంచనా వేసింది. ఈ పెట్టుబడులను సమర్థించేందుకు యేటా సుమారు 760 బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జించే అవకాశాలు అవసరమని పేర్కొంది. ఎఐ ద్వారా అత్యధిక వార్షిక ఆర్థిక ప్రయోజనాలు పొందగల రంగంగా ఆర్థిక సేవల రంగం నిలిచింది. ఈ రంగంలో సుమారు 530 బిలియన్ డాలర్ల విలువ సృష్టించే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది.

విద్యారంగంలో 410 బిలియన్ డాలర్లు, సాంకేతికత, మీడియా, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో 360 బిలియన్ డాలర్లు, ఆరోగ్య సంరక్షణ రంగంలో 310 బిలియన్ డాలర్ల మేర వార్షిక ఆర్థిక ప్రయోజనాలు లభించవచ్చని తెలిపింది. న్యాయ సేవలు, ఆరోగ్య సంరక్షణ, నిర్వహణ, కంప్యూటర్ సంబంధిత వృత్తుల్లో ఎఐని ఖర్చుకు తగిన ప్రయోజనాలతో వినియోగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనిపేర్కొంది. మొత్తంగా, ఎఐ ద్వారా భారీ ఆర్థిక ప్రయోజనాలను సాధించే అవకాశం ఉన్నప్పటికీ, సరైన ప్రణాళిక, వ్యయ నియంత్రణ, ఉత్పాదకత అంచనాలు లేకపోతే ఆశించిన ఫలితాలను పొందడం కష్టమవుతుందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# విను... ఆలో చించు !



మన పని మనం చేసుకు పోదాం. చాలామంది ఉద్యోగినుల ధోరణి అలాగే ఉంటుంది. అనవసర వివాదాల్లో దూరతామేమో అన్న భయం ఒకటే. పని ముగించుకుంటే త్వరగా బయటపడొచ్చు అన్న ఆలోచన మరొకటిందా. సందేహం అడిగితే ఏమీ తెలియదు అనుకుంటారు. ప్రశ్నిస్తే పొగరుగా బావిస్తారు ఇలా లోలోపలే బోలెడు ఊహించుకుంటారు. కానీ ఈ తీరే వారిని ఎదగకుండా ఆపుతుంది. మీదీ అనే వరసైతే బ్రాండింగ్ తప్పనిసరి అంటే మేకోవర్. దుస్తుల్నీ, హెయిర్స్టైలో మార్చమని కాదు... మీ పూర్తి ఇమేజింగ్ మార్చుకోమని అర్థం. అడగండి... ప్రమోషన్ కానీ, పైనాళ్ల మెచ్చుకోలు కానీ రానప్పుడు నిరాశ సహజమే కానీ ఎందుకు రావట్లేదు. అన్న ప్రశ్న వేసుకోండి. అయితే దీనికి మాత్రం మీరే సమాధానం ఇవ్వవద్దు. ఎందుకంటే.. ఫలానా అమ్మాయి నా గురించి చెడుగా చెప్పిందేమో, నేనెక్కడ ఎదిగి పోతానో అని వల్ల ఇలా మనమంటే పడనివారి మీదకే దృష్టి వెళ్తుందట. వాటివల్ల ప్రయోజనం లేకపోగా వర్థం అందుకే మీ పనితీరు తెలిసినవారిని అడగండి వాళ్లైతే మీ లోపాలు కచ్చితంగా చెబుతారు. ఉద్యోగి ఇలాగే చేస్తే ఆమెకేం సలహాలొచ్చాయో తెలుసా! పని చేస్తావు కానీ... అభిప్రాయాలు చెప్పవు ఎప్పుడూ దీనంగా ముఖం పెట్టుకుని ఉంటావు... దీనితో నీతో పని చేయాలని పించదు. వ్యక్తిగత శుభ్రత పాటించు... అంటూ సలహా లొచ్చాయట. అసలీ కోణాలూ మనపై ప్రభావం చూపు ఊహించ గలమా? కొన్ని సార్లు చిన్న అంశాలూ పెద్ద సమస్య అవుతాయనడా నికి ఇది ఉదాహరణ కాబట్టి, ఏ మార్పు అవసరమో అడిగి తెలుసుకోండి. చెప్పినవన్నీ మార్చుకోవాలనేం లేదు. కానీ కొన్నింటినైనా ప్రయత్నించొచ్చు. అప్పు డు నెమ్మదిగా మీలో మార్పు మొదలవు తుంది. చుట్టుపక్కల వాళ్లూ దాన్ని గమని స్తారు. ఒక పరిశోధన ప్రకారం... ఒక పదిని అక్క మగ ఇద్దరూ చేస్తున్నప్పుడు... ఆడవాళ్ల నుంచేఎక్కువ ఫలితం ఆశిస్తారట. మీ సాయి వాళ్లూ అలాగే ఆలోచిస్తుండొచ్చు. కాబట్టి, వాళ్లతోనూ మాట్లాడండి మీ నుంచి ఏమేం ఆశిస్తున్నారో తెలుసుకోండి అయితే వాటిలో సాధ్యా సాధ్యాలు మనిషివి అప్పుడే చెప్పండి. మనకి ఇంటి బాధ్యతలు అదనం. వాటిని గుర్తు చేస్తే ఈ ఆశించడం తగ్గుతుంది అయితే ఒక్కసారి మాట్లాడి ఇబ్బందులన్నీ చెప్పడంతో సమస్య తీరుతుంది. ఎవరికి లేదు. సాధన చేయాలి. నో చెప్పాలి అదంతా నిరంతర ప్రక్రియ, అయితే ఎవరినో అనుసరించొద్దు, అనుకరించొద్దు. గంగలా మాట్లాడలేరా అయితే ఎదుటివారు చెప్పేది వినండి. మీటింగుల్లో కదిలంచ నవసరం లేదు..కానీ,అవసరమైన సందేహాలు అడగొచ్చు.

# కరివేపాక్!

కూరల్లో కరివేపాకు కనిపించగానే.. పక్కన పడేస్తుంటారు. కానీ, అనేక ఔషధ గుణాలున్న కరివేపాకు.. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెడుతుంది. ఆయుర్వేదంలోనూ విరివిగా ఉపయోగపడు తుంది. అయితే.. అందాన్ని మెరుగుపరచడం లోనూ కరివేపాకు ముందుంటుంది. కరివేపాకు ఫేస్ ప్యాక్..మచ్చలేని, కాంతిమంత మైన చర్మాన్ని అందిస్తుంది. కరివేపాకులో యాంటీ ఆక్సి డెంట్లు, యాంటి



ఇన్ఫ్లమేటరీ లక్షణాలు, యాంటి మైక్రో బయల్ వంటి గుణాలు పుష్కలం. ఇవి చర్మ ఆరోగ్యా నికి ఎంతో మేలు చేస్తాయని నిపుణు లు చెబుతు న్నారు. చర్మాన్ని మెరి సేలా చేయడంలోనూ సాయపడ తాయి. కరివేపాకు లో ఉండే ఔషధ గుణాలు.. చర్మానికి తేమను అంది స్తాయి కూడా! కొన్ని కరివేపాకు లను నీటిలో వేసి ఉడక బెట్టాలి. చల్లా రాక.. మిక్సీలో వేసి పేస్ట్లా గ్రైండ్ చేసు కోవాలి. ఈ పేస్ట్కు తేనె కలిపి.. ముఖం, మెడ, చేతులకు ప్యాక్లా రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే.. ముఖంపై మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. వారంలో రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే.. ముఖం ప్రకాశ వంతంగా తయారవుతుంది. కరివేపాకు పేస్ట్లో రెండుమూడు నిమ్మరసం చుక్కలు వేసి.. ముఖానికి ఫేస్ ప్యాక్లా వేసుకోవాలి. ఆరిన తర్వాత ముఖాన్ని కడిగేసుకుంటే.. చర్మం కాంతిమంతంగా మారుతుంది. కరివేపాకు పేస్ట్కు, కొద్దిగా పాలు కలిపిముఖానికి ప్యాక్ వేసుకున్నా.. మచ్చలు, ముడతలు తగ్గుతాయి.

# నిత్యయౌవన రహస్యం



ఆరోగ్య కరమైన డైట్ అయినా వయసును తగ్గిస్తుంది. ఆహారం కంటే సమతుల్య భోజనమే ముఖ్యమని స్పష్టంవయసు పెరుగుదలను నియంత్రించి, యవ్వనంగా కనిపించడం కోసం చాలామంది రకరకాల డైట్లను అనుసరిస్తుంటారు. అయితే, ఏదో ఒక ఖిమ్యాజిక్ డైట్ఖి పాటించడం కంటే, స్థిరంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కొనసాగించడమే కీలకమని ఓ తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. 'నేచర్ కమ్యూ నికేషన్స్' జర్నల్లో ప్రచురితమైన ఈ పరిశోధన, వృద్ధాప్య వేగాన్ని తగ్గించడంలో ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను శాస్త్రీయంగా వివరించింది.జర్మన్ సెంటర్ ఫర్ న్యూరోడీజనరేటివ్ డిసీజెస్ జర్మన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ న్యూట్రిషన్, మరియు బాన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. వారు సుమారు 7,500 మంది వయోజనుల ఆహారపు అలవాట్లను, రక్త నమూనా లను విశ్లేషించారు. ఇందులో కాలక్రమేణా వచ్చే వయసు కాకుండా, శరీరం లోపల కణాల స్థాయిలో జరిగే వృద్ధాప్య ప్రక్రియను సూచించే "జీవ సంబంధ వయసు'ను కొలిచారు. ఇందుకోసం డీఎన్ఏపై ఉండే రసాయన మార్పులను గుర్తించే 'ఎపిజెనెటిక్ క్లాక్స్' అనే అధునా తన పద్ధతిని ఉపయోగించారు.ఏ డైట్ పాటిం చినా ఫలితం ఒక్కటేపరిశోధకులు సుమారు 10 రకాల ప్రసిద్ధ ఆరోగ్యకర మైన ఆహార పద్ధతులను విశ్లేషిం చారు. వీటిలో మధ్యధరా డైట్, నార్డిక్ డైట్, మొక్కల ఆధారిత డైట్లు అధిక రక్తపోటును నియంత్రించే డాష్ డైట్, మెదడు ఆరోగ్యం కోసం రూపొందించిన మైండ్ డైట్ వంటివి ఉన్నాయి. ఆశ్చర్యకరంగా, ఈ పద్ధతుల్లో ఏ ఒక్కదానికో కట్టుబడిన వారందరి లోనూ జీవసంబంధ వృద్ధాప్య వేగం నెమ్మదించి నట్లు గుర్తించారు.అంటే, ఫలానా డైట్ మాత్రమే గొప్పదని చెప్పలేమని, ఏ రకమైన ఆరోగ్యకరమైన ఆహార పద్ధతిని స్థిరంగా పాటించినా సానుకూల ఫలితాలు ఉంటాయని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ డైట్లన్నీ వేర్వేరుగా కనిపించినప్పటికీ, శరీరంపై అవి చూపించే ప్రభా వంలో 70 శాతానికి పైగా సారూప్యత ఉన్నట్లు కనుగొన్నారు. ఇవన్నీ కణాల జీవక్రియ, నిర్మాణం, కమ్యూనికేషన్ వంటి కీలకమైన ప్రక్రియ లను మెరుగుపరుస్తున్నట్లు తేలింది.ధూమపానం చేసేవారిలో ఆసక్తికర ఫలితంఈ అధ్యయనంలో మరో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆరోగ్యకరమైన ఆహారం, జీవసంబంధ వయసు తగ్గడానికి మధ్య ఉన్న సంబంధం ధూమపానం చేసేవారిలో మరింత బలంగా కనిపించింది. మొత్తంమీద ఈ అధ్యయనం ఇచ్చే సందేశం ఒక్కటే. ఖరీదైన, దిగుమతి చేసుకున్న ఫుడ్స్ లేదా కఠినమైన డైట్ల వెంట పడాల్సిన అవసరం లేదు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, తృణధాన్యాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని తమ బడ్జెట్, సంస్కృతికి అనుగుణంగా ఎంచుకుని, స్థిరంగా పాటిస్తే చాలు... జీవ గడియారాన్ని నెమ్మదిగా కదిలేలా చేయవచ్చని ఈ పరిశోధన భరోసా ఇస్తోంది. అయితే, ఇది కేవలం పరిశీలనాత్మక అధ్యయనం మాత్రమేనని, ఆహార మార్పులే వయసు వేగాన్ని తగ్గిస్తాయని కచ్చితంగా నిర్ధారించలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

# అష్టకష్టాలంటే ఇవే ..

జీవితంలో కష్టాలనేవి ఒకదాని తరువాత ఒకటిగా వచ్చిపడుతుంటాయి. అలాంటప్పుడు వాటిని తట్టుకుంటూనే ముందుకు వెళుతుండటం చేస్తుంటాం. ఇక ఒక్కోసారి కష్టాలన్నీ ఒకేసారిగా వచ్చి మీదపడుతుంటాయి. అలాంటప్పుడు వాటిని ఎదిరించి నిలవడం మరింత కష్టమవుతుంది. కష్టాలనేవి సహనాన్ని పరీక్షి స్తూ కుదిపేస్తూ ఉంటాయి .. జీవితంపై నిరాశా నిస్పృ హాలను కలిగిస్తూ ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో ఎవరైనా పలకరిస్తే, అష్టకష్టాలు పడుతున్నాం అని అంటూ ఉంటాం. అష్టకష్టాలనేవి ఏమిటో తెలియకుండానే ఈ మాటను అనేస్తూ ఉండటం జరుగుతుంటుంది. అష్టకష్టాలు అంటే ఎనిమిది రకాల కష్టాలు. ఈ ఎనిమిది రకాల కష్టాలను ఏక కాలంలో అనుభవించే పరిస్థితులు కూడా వచ్చేస్తూ ఉంటాయి. అప్పులపాలు కావడం .. ఇతరు లను యాచించవలసి రావడం .. పేదరికం అనుభవిస్తూ ఉండటం .. ఎంగిలి అన్నం తినవలసి రావడం .. దొంగతనం చేయ వలసి రావడం .. రోగంతో యాతన పడుతుండటం .. వృద్ధా ప్యం .. భార్యా వియోగంతో బాధపడుతూ ఉండటం అష్టకష్టాలుగా చెప్పబడుతున్నాయి. ఎంతటి కష్టమైనా భగవంతుడి అనుగ్రహంతో తీరిపోతుంది .. అందుకు అనునిత్యం ఇష్టదేవతారాధన చేయవలసి ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి.

# మలబద్ధకం తగ్గాలంటే..



పిల్లల్లో శారీరక శ్రమ బాగా తగ్గిపోయింది. ఎంతసేపూ కదలకుండా ఒకే చోట కూర్చోవడం, గంటల తరబడి గ్యాడ్జెట్లకు అతుక్కుపోవడం వల్ల స్థూలకాయం వంటి సమస్యలే కాదు. మలబద్ధకం కూడా వచ్చే ప్రమాదం ఉందంటు న్నారు నిపుణులు. ప్రస్తుతం చాలామంది చిన్నారుల్లో తలెత్తే ఈ సమస్యకు కారణాలు, వాటి పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం.. పిల్లల్లో మలబద్ధకం సమస్య రావడానికి కొన్ని కారణాలంటున్నారు నిపుణులు శారీరక శ్రమ లేకపోవడం/ ఆటలాడక పోవడం/ ఎక్కువసేపు కదలకుండా ఒకే చోటు కూర్చోవడం.. నీళ్లు సరిగ్గా తాగకపోవడం, ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం.. జంక్ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం రాత్రిపూట ఆలస్యంగా తినడం. అర్ధరాత్రి వరకు మేల్కోవడం. నిద్రలేమి. 6.జీవక్రియల పనితీరు మందగించడం.

ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్ల పిల్లలతో తాగించాలి. రుచి కోసం టీస్పూన్ తేనె, నిమ్మరసం కూడా కలిపి అందించవచ్చు. రాత్రి నీటిలో నానబెట్టిన 45 ఎండు ద్రాక్షలను పరగడుపునే తినిపించాలి. ఇంగువను పేస్ట్గా తయారు చేసుకుని పిల్లల బొడ్డు చుట్టూ సవ్యదిశలో రాయాలి. దీనివల్ల వారిలో అజీర్తి సమస్యలేవైనా ఉంటే దూరమవుతాయ! పచ్చి ఆహార పదార్థాలను పిల్లలు జీర్ణం చేసుకోలేరు. కాబట్టి వారికి ఉడకబెట్టిన, వండిన ఆహార పదార్థాలను అందించాలి. 6. పిల్లలకు అందించే ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు, నూనెల మోతాదును బాగా తగ్గించాలి. 7.పిల్లలతో వివిధ రకాల వ్యాయామాలు చేయడంతో పాటు ఆటలాడేలా వారిని ప్రోత్సహించాలి. నడక, పరుగు, జాగింగ్.. వంటివీ మంచివే 8.అయితే ఈ చిట్కాలు పాటిస్తున్న పిల్లల్లో మలబద్ధకం సమస్య తగ్గుముఖం పట్టకపోతే.. పిల్లల వైద్య నిపుణులను సంప్రదించి వారికి తగిన చికిత్స అందించడం మంచిది.

# తెర



## 27న అలియాస్ రుక్మిణి ఫస్ట్ సింగిల్

బ్లాక్బస్టర్ సక్సెస్ కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్తో రాబోతోంది. ఖిఅలియాస్ రుక్మిణి అనే టైటిల్తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, దండోరా ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న అలియాస్ రుక్మిణి ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్గా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిసు ట్ట న్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్కు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి పెరిగిం ది.ఇప్పుడు మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ను కిక్ స్టార్ట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫస్ట్ సింగిల్ రుక్కురుక్కు రుక్మిణి పాటను అక్టోబర్ 27న విడుదల చేయనున్నారు.ఈ చిత్రం డిసెంబర్ 4న విడుదల కానుంది.

## ఆకాశంలో ఒక తార రుహానీ శర్మ ఫస్ట్ లుక్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా ఆకాశంలో ఒక తార గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో ముఖ్య మైన పాత్రను మేకర్స్ పరిచయం చేశారు.ఈ సినిమాలో బిజిలీగా నటిస్తున్న రుహానీ శర్మ ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేశారు. కిటికీ పక్కన కూర్చుని కనిపిస్తున్న ఆమె సంప్రదాయ దుస్తుల్లో సింపుల్గా, అందంగా ఆకట్టుకున్నారు.బిజిలీ పాత్ర సినిమాలో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందనే ఆసక్తిని ఈ ఫస్ట్ లుక్ పెంచుతోంది.2026 నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## 418కి ఎక్స్ట్రార్డినరీ రెస్పాన్స్



మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ 418 సినిమాకు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నిన్నటి కంటే ఈరోజు చాలా బాగుంది. మేము చేసిన ఫస్ట్ హారర్ సినిమా ఇది. మా బ్యాన ర్కు ఇంత మంచి సినిమా చేసి పెట్టిన డైరెక్టర్ కీర్తన్కు థాంక్యూ. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ..కీర్తన్ ఎక్స్ట్రార్డినరీ స్టోరీ రాసి, సిని మాను అద్భుతంగా చేశాడు. సౌండ్ డిజైన్, మ్యూజిక్ కూడా చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా బాగుందని అందరూ అంటున్నా రు. అదే సమయంలో సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తు న్నారు. టెక్నికల్గా సినిమా అద్భుతం. ప్రకీర్తన్ యంగ్ టీమ్ను సెలెక్ట్ చేసుకుని సినిమాను చాలా పెద్ద సక్సెస్ చేశాడు. మైత్రీ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రీమియర్స్ నుంచే ఈ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా సౌండ్ గురించి ఆడియన్స్ గొప్పగా మాట్లాడుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో తెలుగులో ఇలాంటి హారర్ సినిమా నేను చూడలేదు. డైరెక్టర్ కీర్తన్ నాదగౌడ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. నిర్మాతలు నవీన్ గారు, రవి గారికి థాంక్స్. ప్రశాంత్ నీల్ గారు చాలా ప్రోత్సహించారు.

## విశ్వదేవ్ హీరోగా ప్రొడక్షన్ నెం.1 సినిమా అనౌన్స్ మెంట్



"35 చిన్న కథ కాదు" సినిమా ఫేమ్ విశ్వదేవ్ హీరోగా మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ సినిమా శ్రీ తులసి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా రాబోతోంది. "ముఖచిత్రం" సినిమా ఫేమ్ దర్శకుడు గంగాధర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో నర్సి రాజగిరి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్ కు పరిచయమవుతున్నారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్ మెంట్ చేశారు. ఒక కొత్త తరహా కాన్సెప్ట్ తో న్యూ టాలెంటెడ్ డైరెక్టర్ నర్సి రాజగిరి ఈ సినిమాను రూపొందించే ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. "ముఖచిత్రం" వంటి వైవిధ్యమైన సినిమాను తెరకెక్కించిన దర్శకుడు గంగాధర్ ఈ సినిమాతో నిర్మాతగా మారుతుండటం విశేషం. ముఖచిత్రం సినిమా దర్శకుడిగా గంగాధర్ కు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ సినిమాతో ఆయన అందరి ప్రశంసలు పొందారు.

## డార్క్ చాక్లెట్ సినిమా ట్రైలర్ లాంచ్



రానా దగ్గుబాటి ప్రెజెంట్స్, విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి, శశాంక్ శ్రీవాస్తవయ, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ స్పిరిట్ మీడియా డార్క్ చాక్లెట్ ట్రైలర్ లాంచ్ హీరో విశ్వదేవ్ రాచకొండ మాట్లాడుతూ..ప్రతి మనిషిలో ఒక డ్యూయాలిటీ ఉంటుంది. అది ఈ సినిమా చూసినప్పు డు మిర్రర్ రిఫ్లెక్షన్స్లా మీకు కనిపిస్తుంది. ఇది నెవర్ బిఫోర్, ఎవర్ ఆఫ్టర్లాంటి సినిమా. ఇలాంటి సినిమా ఇంతకుముందు ఎప్పుడూ రాలేదు. ఏ భాషలో వచ్చిన సినిమాతోనూ దీనిని కంపేర్ చేయలేరు.

బిందు మాధవి మాట్లాడుతూ..బిగ్ స్క్రీన్ మీద ట్రైలర్ చూస్తుంటే చాలా హ్యాపీగా అనిపించింది. చాలా అద్భుతంగా ఉంది. ఇది రెగ్యులర్ ఫార్మా ట్లో ఉండే సినిమా కాదు. చాలా డిఫరెంట్గా ఉంటుంది. రాకేష్ రాచకొండ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నేను చేసిన పాత్ర ఒక నటుడిగా నాకు చాలా సంతృప్తినిచ్చింది.

## నవంబర్ 13న రోమియో జూలియట్



హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న రోమియో జూలియట్ట్ సినిమా థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో హర్షిత్ మాట్లాడుతూ.. దివాన సినిమాకి అందరూ సపోర్ట్ చేశారు. రోమియో జూలియట్ట్కు మీ సపోర్ట్ కావాలని కోరుతున్నాను. మా సినిమా గ్లింప్స్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా ప్రభాస్ గారికి ధన్యవాదాలు. ఆయ న ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేయడం మా అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డైరెక్టర్ భార్గవ్ మాచర్ల మాట్లాడుతూ.. ఇది అందరి బయోపిక్. మనందరి జీవితంలో ఎక్కడో ఒకచోట కనెక్ట్ అయ్యే ఎమోషన్ను తీసుకుని సినిమాగా చేయడం జరిగింది. ఇది హిలేరియస్ ఫన్ రైడ్లా ఉంటుంది. ఈటీవీ విన్ వైస్ ప్రెసిడెంట్ సాయికృష్ణ మాట్లాడుతూ.. మేము నిర్మించని సినిమా కాకుండా బయట సినిమాని ఫస్ట్ టైం ప్రజెంట్ చేస్తున్నాం . ఇది మాకు చాలా స్పెషల్. అలాగే మయూరి మూవీస్ ద్వారా ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నాం. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ.. ఇది ప్రస్తుత జనరేషన్పై మంచి హిలేరియస్ సినిమా. లవ్ టుడే లాంటి ఎంటర్టైనర్. నవంబర్ 13న తప్పకుండా మీరంతా ఎంజాయ్ చేస్తారు.

## ఫీల్ గుడ్ సినిమా నుంచి సాంగ్ రిలీజ్



టాలీవుడ్లో హాట్ టాపిక్గా అవుతూ తెర కెక్కుతున్న రొమాంటిక్ కామెడీ చిత్రం ఫీల్ గుడ్ నుంచి మమ్మా మియ్యా పూర్తి పాటను చిత్ర బృం దం విడుదల చేసింది. విశ్వరూప ఫిల్మ్స్ బ్యాన ర్పై దయానంద్ కథ, స్క్రీన్ప్లే, దర్శకత్వంలో సుచిత్ నిర్మాణంలో సుచిత్, అదితి త్రిపాఠి జంట గా నటించిన ఈ పాట ఆకట్టుకునే సంగీతం, యువతను ఆకట్టుకునే బాణీ, ఉత్సాహభరితమైన పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయిఈ చిత్రంలో సుచిత్, అదితి త్రిపాఠితో పాటు రవూరి ప్రియాంక, లిఖిత్, రణధీర్ వాసుదేవ్, సైఫాని, దివ్య మోహన్ తదితరులు నటిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వర లోనే విడుదల చేయడానికి చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. మమ్మా మియ్యా పాట విడుదలతో ఫీల్ గుడ్ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతుందని, యూత్ ఆడియన్స్కు కనెక్ట్ చేస్తుందని చిత్ర బృందం ఆశిస్తోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.